స్థాపితం : 1930 LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు

జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

సమాచారం

సంపుటి : 79 సంచిక 25 20-6-2008 శుక్రవారం 16 పేజీలు వెల : రూ. 5/-

స్కైల్ సూపర్ స్పెషాలిటీ
దంతవైద్యశాల
ఆర్.టి.సి బస్టాండ్ దగ్గర, రమేష్‌నాయుడు పురం
నెల్లూరు - 524003.
- కేవలం ఒకే ఒక్క రోజులో స్మైల్ డిజైనింగ్
- ఒక్క రోజులో ఫిక్స్‌డ్ పళ్ళు అమర్చుట
- ఒక్కరోజులో Teeth Whitening
- ఒక్కరోజులో పళ్ళ సెట్టు అమర్చుట
Ph : 0861 : 2330949, 2344693, 9246434447


a ★★★ hotel with 5 star comforts
D.R. UTTHAMA HOTEL
Winner of Excellence Award 2004, 2005 & 2006
Nellore - 524 003. Ph: 0861 - 2317777

ఈ ఏడాదంతా జనంపై ధన వర్షం!

రాబోయే ఎన్నికలకు అన్ని శస్త్రాలు సమకూర్చుకునే పనిలో నిమగ్నమై పోయాడు ముఖ్యమంత్రి. నిద్ర లేస్తే వేరే పని లేదు. మంత్రులతో మాట్లాడినా, ఎమ్మెల్యేలతో ముచ్చట్లు చెప్పినా, అధికారులకు ఉత్తర్వులు చేసినా ఎన్నికల ప్రస్తావన తప్పడం లేదు. నవంబర్‌లో ముందస్తు ఎన్నికలు తప్పక పోవచ్చన్న అభిప్రాయం దృవ పడడంతో ఆయనలో తొందర పెరిగి పోయింది. ఆతృత హెచ్చింది. ఒక్కరోజు వృధా చేసినా ఆ తర్వాత బాధపడి లాభం లేదన్న ధోరణిలో వున్నాడు.

ఇటీవల జరిగిన తెలంగాణా ఉప ఎన్నికలను ఇందుకు మార్గదర్శకంగా భావిస్తున్నాడు ముఖ్యమంత్రి. తెలంగాణాలో ఆయన ప్రధానంగా మూడు అంశాల మీద దృష్టి పెట్టారు. కాంగ్రెస్ శక్తులన్నిటినీ సంఘటితం చేయడం. గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలలో ఉత్సాహం నింపడం; ఎమ్మెల్యేలు మంత్రుల మధ్య విభేదాలు తొలగించి ఐక్యత సాధించడం మొదటి ఎత్తుగడ. రెండవది అభ్యర్థులకు డబ్బు లోటు లేకుండా చూడడం. ఓటర్లకు వ్యక్తిగతంగా ప్రయోజనం కల్గించే పథకాలు అమలు చేయడం మూడవ అంశం.

తెలంగాణా ఎన్నికలలో కాంగ్రెస్ కార్యకర్తలను సంఘటితం చేయడానికి చాలా శ్రమ పడ్డాడు ముఖ్యమంత్రి. కొన్ని వేలమందితో స్వయంగా ఫోన్లో మాట్లాడాడు. వీరేమి అడిగితే ఆ హామీ ఇచ్చాడు. దాని ఫలితంగా పోలింగ్ బూతుల స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పని చేశారు. కార్యకర్తలు కృషి చేస్తే, వారి వ్యక్తిగత స్థాయిలో పది నుంచి వంద ఓట్ల వరకు సమీకరించ గలరన్నది ముఖ్యమంత్రి అంచనా. త్రికోణపు పోటీలో, గెలుపు ఓటముల మధ్య తేడా అతి తక్కువగా వుండే పరిస్థితులలో వంద ఓట్లకు కూడా ఎంతో విలువ వుంటుంది. అందువల్ల కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నది ఆలోచన. అందుకోసమే వెయ్యి కోట్లు వెచ్చించి, పూర్తిగా నామినేషన్ పద్ధతి మీద కార్యకర్తలకు చిల్లర మల్లర పనులు కేటాయించాలని ప్రభుత్వ స్థాయిలోనే ఉత్తర్వులు చేశారు. దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రీ తెగబడని దుశ్చర్య ఇది. పార్టీ కార్యకర్తల జేబులు నింపడానికి ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బు పందారం చేయాలని ప్రభుత్వం ఉత్తర్వు చేయడం చరిత్రలో ఎప్పుడూ వినలేదు. కనలేదు. దీనిపై ఎన్ని విమర్శలు వస్తున్నా ఆయన లెక్క చేయడం లేదు. ఈ వెయ్యి కోట్లతో చేపట్టే పనులు కేవలం కాగితాలకే పరిమిత మౌతాయని ఆయనకు తెలుసు. ఆయన ఉద్దేశం కూడా అదే. మండలానికి కనీసం ఇరవై మంది ముఖ్య కార్యకర్తల చేతిలో ఐదు నుంచి పది లక్షల రూపాయల డబ్బు చేరితే, ఎన్నికలలో వారు ఉత్సాహంగా పని చేస్తారన్నది అంచనా. అభ్యర్థులకు డబ్బు సమకూర్చడం ముఖ్యమంత్రికి చిటికె వేసినంత సులభం. గత నాలుగేళ్లలో ఆయన సంపాదన ఇరవై వేల కోట్ల రూపాయలు మించి పోయిందని ప్రతిపక్షాలే కాక కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా బహిరంగంగానే మాట్లాడుకొంటున్నారు. అందులో నుంచి ఒక వెయ్యి, రెండు వేల వెదజల్లడం పెద్ద కష్టం కాబోదు. ఉప ఎన్నికల సమయంలో ఒక్క జడ్పర్ల శాసనసభ స్థానంలోనే ఇరవై కోట్లు వెచ్చించారని చెప్పున్నారు. మల్లు రవి పోటీ చేసిన ఈ

తొరవ 14వ పేజీలో


ఉదయగిరి నాకొద్దు... సిఎంకు మేకపాటి వినతి!

వచ్చే ఎన్నికలలో తనకు ఉదయగిరి వద్దని, ఆత్మకూరులో అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే మేకపాటి శేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రికి మొర పెట్టుకున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే మూడుసార్లు ముఖ్యమంత్రిని కల్సి ఈ వినతి విన్పించి వచ్చాడట ఆయన. నియోజకవర్గాల పునర్విభజనలో ఆయన స్వంత మండలం మర్రిపాడు, ఆత్మకూరులో చేరిపోయింది. ఆ ఒక్క మండలంలో తనకు 10వేల ఓట్ల మెజార్టీ వచ్చే అవకాశం వుంది కాబట్టి, ఆత్మకూరులో తాను సులభంగా గెలుపొందుతానన్నది మేకపాటి అంచనా. ఈ మార్పుకు జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆమోదం కూడా వుంది. ఇద్దరూ సంప్రదించుకున్న తర్వాతే ముఖ్యమంత్రి వద్దకు వెళ్లినట్లున్నారు.

అయితే ఆయన స్థానంలో ఉదయగిరికి అభ్యర్థి ఎవరు అన్నది పెద్ద ప్రశ్న. కావలి నుంచి మాగుంట పార్వతమ్మను అక్కడకు తరలించమని సలహా ఇచ్చాడట రామనారాయణరెడ్డి. అయితే అందుకు మాగుంట కుటుంబం సుముఖంగా లేదు. తమకు కావలే శ్రేయస్కరమని వారి భావన. మేకపాటి చేసిన ఈ అభ్యర్థన జిల్లా కాంగ్రెస్ రాజకీయాలలో పెను కలకలం సృష్టించడం ఖాయం. స్వతంత్ర ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడును కాంగ్రెస్‌లోకి రప్పించు కుని, ఆత్మకూరులో ఆయన్ను పోటీకి పెడితే గెలుపు సులభమని, ఎమ్మో ఓట్లకు అనుకూలమని నేదురుమల్లి జనార్దనరెడ్డి వాదన. కానీ కొమ్మి చేరిక రామనారాయణరెడ్డికి ఎంత మాత్రం ఇష్టం లేదు. ఆయన్ను కొట్టడానికే మేకపాటిని ముగ్గులోకి దించాడని చెప్తారు. పార్వతమ్మను ఉదయగిరికి తరలిస్తే, కావలి స్థానం తనకు దక్కుతుందన్నది అల్లూరు ఎమ్మెల్యే విష్ణు ఆశ. నియోజక వర్గాల పునర్విభజనలో అల్లూరు మాయం కావడం ఆయన్ను కలత పెడుతున్నది. పోటీ చేయడానికి ఆయనకు కావలి తప్ప మరొక చోటు లేదు. ఆత్మకూరులో కొమ్మి ప్రాబల్యం తెల్సిన సంగతే. గత ఎన్నికలలో బొల్లినేని కృష్ణయ్య వంటి అపర కుబేరుడినే బోల్తా కొట్టించాడు. కృష్ణయ్య దగ్గర డబ్బు తీసుకుని, దాన్నే చందాగా ఇచ్చి మరీ గెల్పించుకున్నారు జనం. అటు వంటి ప్రజాదరణ కల్గిన కొమ్మిని వదలుకోవడం కాంగ్రెస్‌కు ఆత్మహత్యా సదృశ్యం. అది తెలిసి కూడా ఆయన చేరికకు అభ్యంతరం పెడుతున్నాడు రామనారాయణరెడ్డి. అందుకు ఆయన కారణాలు ఆయనకున్నాయి.

మేకపాటి విజ్ఞప్తిని మన్నిస్తే, ఉదయగిరి, కావలి, ఆత్మకూరు నియోజక వర్గాలు మూడింటిలో కాంగ్రెస్ గందరగోళ పడే ప్రమాదం వున్నందువల్ల, ముఖ్యమంత్రి దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నా అది పార్టీపై ప్రభావం చూపే అవకాశాలున్నాయి.

నెల్లూరీయుల జ్ఞానతృష్ణకు సాంచరత్వవృద్ధికి
ఒక పక్కనే నెలవు
ప్రభవ
పాగాతోట-నెల్లూరు. ఫోన్: 2323167, 2329567
ప్రతి రోజు ఉ. 9గంటల నుండి రా. 9గంటల వరకు.
ఆదివారం కూడా ప్రభవం తెరచి వుండును.


TWO WORDS. TO WARDS డాక్టర్ చెప్పి చేయ్యి
is not an ordinary Person but he is
'HE' in my view. డాక్టర్ పెళ్ళకూరు జె.పి.రెడ్డి with ex-Animo
M.B.B.S, FSI, FIC, USA
చర్మ & తొలి సెక్యాలజిస్ట్ అమెరికా. రైలుకట్టవీధి. పాగాతోట. నెల్లూరు P.S Dt.
Ordinary Phone : 2329559 (0861) 2333666

ఆంధ్ర మరియు చెన్నైలలో ప్రఖ్యాతిగాంచిన ఇంజనీరింగ్ కాలేజీల నందు అతి తక్కువ డొనేషన్స్ మరియు అతిసాధారణ ఫీజులతో అడ్మిషన్స్.
MBBS మరియు BDS కోర్సులకు అతి తక్కువ ఫీజులతో అడ్మిషన్స్ కొరకు మమ్మలను సంప్రదించండి.
MBBS
BDS
B.Tech
(All Branches)
MCA
MBA
M. Tech
CARE
EDUCATIONAL CONSULTANCY
శ్రీ రాయలు కాంప్లెక్స్,
అడ్డ బస్టాండ్ ప్రక్కన, బారకోలు సెంటర్
నెల్లూరు - 524001
92464 28028
92464 21021
92469 28028
92469 18018



70 ఏళ్లక్రితం ఈ వారం

నెల్లూరు ముచ్చట్లు

మున్సిపాలిటీ

ఏ.సి సుబ్బారెడ్డిని తిట్టడం లేదని కొందరు, శివరామయ్యను తిట్టడం లేదని కొందరు, శేషారెడ్డిని తిట్టడం లేదని కొందరు ట్రంకురోడ్డు పాలిటిషియన్సు అడుగుతుంటారు నన్ను నిరంతరం. వారి దృష్టిలో వ్యక్తుల తారతమ్యాలేగాని కాంగ్రెసు సంస్థ యొక్క హైన్యోన్నతాలు అవసరం లేదు. మద్రాసు రాజధానిలోనే కాదు, హిందూ దేశమంటిలో గూడా నెల్లూరు పరువు ప్రతిష్టలు అడుగంటిన వనే బెంగ వారికే

24-6-1938

పేజీలు: 12 వెల: అర్ధణా

మాత్రం వుండదు. బాధ్యత గల కాంగ్రెసు పెద్దలు ఈ సంకుచిత బుద్ధుల సలహాలను పాటింపక ఈ చీలిన హృదయాలను, చెదిరిన భిన్న శక్తులను ఏకీకృతం చేయడం ఎట్లానా? అనే ఆలోచింపవలసి యుంటుంది. మరొక మాట – మొన్నటి ఎలక్షన్ ఫలితంగా నెల్లూరు నడి వీధుల్లో హిందూ మహ్మదీయ ద్వేషం మాదిరి బ్రాహ్మణ – అబ్రాహ్మణ మంటలు యదేచ్ఛంగా మండుతున్నవి. అంత పెద్ద జస్టీసు ఉద్యమం నాడు గూడా పెట్రోలు పోసి చిదుగులేసి మంట చేసినా చల్లారి పోయిన ఈ యగ్ని మండడమేమిటి.

సౌత్‌బోర్డు వైస్ ప్రెసిడెంట్

సౌత్‌బోర్డు వైస్ ప్రెసిడెంట్ 14 తేది 3 గంటలకు సకల గ్రహాలు ఏకాదశ స్థానంలో వుండగా డేగా రామిరెడ్డి గారిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సత్యం – న్యాయం – ధర్మంగా పరిపాలించిన ప్రజల మన్ననలు బడయమని రామిరెడ్డి గారికి మాయాశీస్సులు, ఛాన్సున్నా – లేకున్నా కొండంత ఆశతో వుండికూడా పోటీ చేయకుండా తమ్ముడు – అక్కపనాయుడు గార్ల మాట మీద సరుదుకొన్న ముంగమూరు పిచ్చన్న గారికి మా ధన్యవాదాలు.

తాగి తూలుదాం!

తాగని వాడెందుకు ఈ లోకంలో, స్వర్గలోకమగు పడతది ఈ లోకంలో అన్నాడొక సినిమా కవి. ఈ పాట రాష్ట్ర ప్రభుత్వానికి మహా బాగా నచ్చినట్లుంది. రాష్ట్ర ప్రజలంతా తాగి తూలాలని, స్వర్గలోకంలో తేలియాడాలని తపన పడుతున్నది. రాబోయే రెండేళ్లకు బ్రాందీ షాపుల వేలం పాట జరిగిన తీరు ఈ ధోరణికి దర్పణం పడుతున్నది. ప్రభుత్వ ఆలోచన వ్యాపారులకు బాగా అర్థమయ్యిందో ఏమో కానీ, షాపుల కోసం వారు ఎగబడిన తీరు చూస్తే ఆశ్చర్యం కల్గక మానదు. కోట్లు క్రుమ్మరించి మరీ పోటీ పడ్డారు. ఒక్కొక్క షాపుకు రెండు కోట్ల వరకు చెల్లించడానికి సిద్ధ పడ్డారు. హైదరాబాద్ వంటి నగరాలలోనే కాదు, నెల్లూరు వంటి చిన్న నగరాలలో కూడా ఈ పోటీ అధికారులనే ఆశ్చర్యపరచింది. ఒక్క లైసెన్స్ ఫీజుల రూపంలోనే సర్కారు ఖజానాకు మూడు వేల కోట్ల రూపాయల రాబడి లభించింది. ప్రభుత్వం వేసిన అంచనా కంటే దాదాపు రెట్టింపు ఇది.

మద్యం వ్యాపారం పట్ల ఒక్క సారిగా ఇంత మోజు పెరగడానికి ప్రధాన కారణం – ఇది ఎన్నికల సంవత్సరం కావడమే. శాసనసభ, లోక్‌సభలు రెండింటికీ ఈ ఏడాదిలో ఎన్నికలు జరగాలి. అభ్యర్థులు జెండా లేకుండా ప్రచారం చేసుకోగల్గుతారు కానీ, చీప్ లిక్కర్ సీసా లేకుండా అడుగు ముందుకు కదలదు. ఈ ఒక్క పద్దుకే ఒక్కొక్క పార్టీకి కోట్ల ఖర్చు వుంటుంది. అంత భారీ వ్యాపార అవకాశం కళ్ల ముందు కన్పడబట్టే, బ్రాందీ షాపుల గిరాకీ అనూహితంగా పెరిగింది.

మరొక ప్రక్క ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం కూడా సారా ప్రవాహం పెరగడానికి ఒక కారణం. ఈ పథకం పల్లెలలో పేదలను సోమరి పోతులుగా మారుస్తున్నది. వ్యవసాయ పనులకు కూలీలు దొరకని దుస్థితి కల్పిస్తున్నది. పేదల చేతిలో డబ్బు మెదలుతున్నది. రోజంతా ఖాళీగా వుంటూ కూడా కూలీ గిట్టుబాటు కావడంతో, పేద జనంలో త్రాగుడు దుర్వ్యసనం మితి మీరి పోతున్నది.

మొత్తం మీద మద్యం వ్యాపారం ప్రభుత్వ ఖజానాను సిరి మూటలతో నింపుతున్నది. టోకు వ్యాపారం ప్రభుత్వమే నడుపుతున్నది కాబట్టి, లైసెన్స్ ఫీజులతో పాటు ప్రతి సీసా మీద లాభం వస్తున్నది. అమ్మకపు పన్ను దానికి అదనం. ఇవన్నీ కలిపి ఈ ఏడాది రాబడి 12వేల కోట్లకు పైబడవచ్చునని అంచనా. అంటే ప్రణాళికా పెట్టుబడులలో నాలుగవ వంతు ఒక్క బ్రాందీ సీసాల ద్వారానే లభిస్తున్నదన్న మాట.

రెండు రూపాయల కిలో బియ్యం మీద ప్రభుత్వం పెట్టే సబ్సిడీ ఖర్చు కేవలం వెయ్యి కోట్ల రూపాయలు. అంతకు వన్నెండు రెట్లు అదే పేద ప్రజల జేబులు కొల్లగొట్టి ఆరగించబోతున్నారు. రాష్ట్ర జనాభా 8 కోట్లనుకుంటే, అందులో మహిళలు, పిల్లలు, ముదుసలులు, త్రాగని వారిని తీసి వేస్తే, మద్యానికి బానిసలైన వారి సంఖ్య 30 శాతం దాటదు. అంటే రెండు కోట్ల మంది ప్రజలు వన్నెండు వేల కోట్ల రూపాయల సారా త్రాగుతున్నారు. సరాసరిన ఒక్కొక్కరు ఏడాదికి సారా కోసం 10వేల రూపాయల వరకు వెచ్చిస్తారన్నమాట. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ బియ్యం వల్ల పేద వాడు మిగిల్చుకునేది మహా అయితే ఏడాదికి రెండు వేల రూపాయలు వుంటుంది. ఆ సహాయం చేసినందుకు, ప్రభుత్వానికి పది వేల రూపాయల ప్రత్యుపకారం చేస్తున్నారు పేద జనం. ఈ లెక్క అర్థం చేసుకుంటే చాలు మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వం ప్రజలను ఎంత దారుణంగా దోచుకున్నదీ తెల్సుకోవడానికి.

మద్యం ఒక మానసిక బలహీనత. దాన్ని నిర్మూలించడం ప్రభుత్వాల తరం కాదన్నది నిజం. మద్య నిషేధం అమలు చేయాలనే ప్రయత్నం జరిగినప్పుడల్లా సాంఘికంగా అరాచక పరిస్థితులు, కల్తీ చావులు వంటి దుష్పరిణామాలు తప్ప, సత్ఫలితాలు ఎప్పుడూ రాలేదు. అందువల్ల ఆ విషయంలో ప్రభుత్వాలను తప్పుబట్టలేము. అయితే, ప్రభుత్వ రాబడి పెంచుకోవడానికి మద్యాన్ని ఒక వనరుగా వాడుకోవాలన్న ప్రయత్నం మాత్రం గర్హనీయమైనది. మద్యం వ్యాపారాన్ని నియంత్రించవల్సిన ప్రభుత్వం, దాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచడానికి దోహదపడుతున్నది. బెల్ట్ షాపుల పేరిట పేద వాడి ముంగిటకు మద్యాన్ని తెచ్చి, ప్రలోభ పెట్టి మరీ తాగిస్తున్నది. త్రాగే వారందరూ త్రాగుబోతులు కాదు. కళ్ల ముందు కన్పడితే వుర వుర లాడడం తప్ప, దానికోసం ఎక్కడికో వెళ్లి తెచ్చుకోవాలన్న కోరిక త్రాగేవారిలో సగానికిపైగా వుండదు. మద్య నిషేధం పెట్టక పోయినా, బ్రాందీ షాపుల సంఖ్య బాగా తగ్గించి, ప్రధాన రహదారులు, పాఠశాలలు, దేవాలయాలు, కూడలి ప్రాంతాలలో షాపు లేకుండా చూస్తే, చాలా మంది త్రాగుడికి దూరమౌతారు. పైకి ఎన్ని మాటలు చెప్పినా, లో లోపల ప్రభుత్వం బెల్టు షాపు సంస్కృతిని అనుమతించడం ద్వారా పేద వాడిని త్రాగుడికి బానిస చేస్తున్నది. వాడి ఆర్థిక పరిస్థితిని, ఆరోగ్యాన్ని, కుటుంబ సౌఖ్యాన్ని నాశనం చేసి రాబడి పెంచుకొంటున్నది. ఈ దుర్మార్గ వైఖరి విడనాడడం అవసరం. ప్రభుత్వ పెద్దలకు నిజంగా పేదల మీద ప్రేమ వుంటే, మద్యం వ్యాపారాన్ని ఒక ఆదాయ వనరుగా కాకుండా, తప్పని కార్యంగా నిర్వహించాలి.

50 ఏళ్లక్రితం ఈ వారం

ఆత్మకూరులో గోపాలరెడ్డి

"ఎప్పుడూ ఓటిమ్మనమని కోరుటకు పచ్చేవాళ్ళి యిప్పుడు ప్రత్యేక పరిస్థితుల్లో శాసనసభ్యుడుగా పిలమిందు కొనుటకు వచ్చాను. మీ ఆశీర్వాదం వల్ల కేంద్ర ప్రభుత్వంలో మంత్రినయ్యాను. శాసనసభ్యుడుగా పిలమిందుకొంటు స్నంత మాత్రాన మిమ్మలను విస్మరిస్తున్నానని భావించగూడదు. శాసన సభ్యుడుగా వున్నా లేకపోయినా యధా ప్రకారం మీ సేవలో వుండగలనని చెప్తున్నాను" అన్నారు కేంద్ర రెవిన్యూ, సివిల్ వ్యయ శాఖామాత్యులు డాక్టర్

20-6-1958

పేజీలు: 12 వెల: 0-3-0

బెజవాడ గోపాలరెడ్డి గారు. 17 తేది గోపాలరెడ్డి గారు తన నియోజకవర్గమైన ఆత్మకూరు తాలూకాలో పర్యటించి, శాసనసభ్యుడుగా తన విరమణకు ప్రజల వద్ద సెలవు తీసుకున్నారు.

వాసిలి బహిరంగ సభలో సోమశిల ప్రాజెక్ట్ విషయమై ప్రస్తావించి, నేటి దేశ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం సాధ్యపడదని, తృతీయ ప్రణాళికలో చేర్పించుకొనుటకు ప్రయత్నించ వలసి వున్నదని గోపాలరెడ్డి గారు చెప్పారు.

ఫిర్యాదే కారణమా?

పసుపులేటి సిద్ధయ్యనాయుడు గారు శాసనసభ నుండి ఎగువ సభకు ఎన్నుకొనబడే అభ్యర్థిగా రాష్ట్ర కాంగ్రెస్‌చే సెలక్టు చేయబడి, ఢిల్లీలో కేంద్ర పార్లమెంటరీ బోర్డుచే తీసి వేయబడుటకు వెన్నెలకంటి రాఘవయ్యగారు నాయుడు గారిపై జేసిన ఫిర్యాదే కారణమని విశ్వసనీయంగా తెలుస్తున్నది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఈ జాబితా తీసుకొని కాంగ్రెస్ కార్యదర్శి వద్దకు పోయినపుడు, ఈ ఫిర్యాదును చూసి, ఆ పేరును తొలగించవలసిందిగా కోరినారని గూడా తెలుస్తున్నది.

డాక్టర్ శేషారెడ్డి చిరంజీవి!

నెల్లూరు ప్రజావైద్యశాల సీనియర్ డాక్టర్ జెట్టి శేషారెడ్డి మరణం జిల్లాలోని పేద ప్రజలకు తీరని లోటు. ఆయన మరణంతో నెల్లూరు వైద్యవృత్తి చరిత్రలో ఒక శకం సమాప్తమయ్యింది. డాక్టర్ శేషారెడ్డి గారి నాయకత్వంలో ప్రజా వైద్యశాల ఎంతో అభివృద్ధి చెందింది. జిల్లా ప్రజలకు వైద్య సౌకర్యాలు అందించింది. వైద్యవృత్తిలో క్షణం తీరిక లేకపోయినా, విశ్రాంతి సమయంలో నిరంతరం పుస్తక పఠనం సాగించే వారు. నెల్లూరు ప్రజల హృదయాల్లో వారు చిరస్థాయిగా వుంటారు.

కాళిదాసు పురుషోత్తం నెల్లూరు

చట్టాలు దుర్వినియోగం!

వికలాంగులకు సామాజిక గౌరవం, నైతిక బలం చేకూర్చే లక్ష్యంతో అంగ వైకల్యాన్ని ఎత్తి చూపే దూషణలు, ఛీత్కారాలను శిక్షింపదగిన నేరంగా పరిగణిస్తూ ప్రభుత్వం చట్టం తీసుకరానున్నట్లు సంబంధిత మంత్రి ప్రకటించడం జరిగింది. ప్రభుత్వ ఆలోచన అభినందనీయమైనా ఇందుకోసం ప్రత్యేకంగా ఓ చట్టం చేసి తద్వారా సమస్యను తక్షణమే అరికట్ట వలసినంత తీవ్ర పరిస్థితులు ప్రస్తుతం రాష్ట్రంలో లేవు. చట్టం చేసినంత మాత్రాన ఇటు వంటి సమస్యలు సమసిపోవు. అంతే గాకుండా ఈ చట్టాన్ని ఆసరాగా తీసుకొని ఎదుటవారిని ఇబ్బంది పెట్టే అవకాశం వుంది.

సి.హెచ్.హనుమంతరావు నెల్లూరు

జనవాణి

కాపురాలు కూల్చి బావుకొనేదేమిటి?

మద్యం షాపుల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన టెండర్లతో వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాలో వచ్చి చేరాయి. మన జిల్లాలోనూ రికార్డు స్థాయిలో 150 కోట్ల రూపాయలకు మద్యం షాపులను పాడుకొన్నారు. గత ఏడాది కంటే 50 కోట్ల రూపాయలు ఎక్సైజ్‌శాఖకు అదనపు ఆదాయం వచ్చింది. కోటి రూపాయలకు పైబడి మద్యం షాపులు పాడుకొన్న వ్యక్తులు రోజుకు ఎంత సరకు అమ్మాలి? ఏ తీరులో అమ్మాలి?? దీన్ని త్రాగిన వ్యక్తుల ఆరోగ్యాలు ఎంతగా గుల్లవుతాయి. వ్యసనానికి బానిసైన వ్యక్తులు తీసుకొనే నిర్ణయాలవల్ల ఎన్ని కాపురాలు కుప్పకూలుతాయో ఆలోచిస్తే తల తిరిగిపోతుంది. రెండు రూపాయల కిలో బియ్యం, పావలా వడ్డీకే రుణాలు, ఆరోగ్య శ్రీ కార్డుల కన్నా మద్యపాన నిషేధమే గొప్ప పథకమని ప్రభుత్వ పెద్దలు ఎప్పటికి గుర్తిస్తారో?

పి.అరుణకుమారి నెల్లూరు

బూదూరు శ్రీనివాసులు మంచి మనిషి

సుమత నెరగి, జిల్లా పరిషత్ ఉద్యోగిగా పనిచేస్తూ హిందూ వాహినిలో సభ్యునిగా వుంటూ ఎమ్మీఓ అయిన బూదూరు శ్రీనివాసులు జాతీయ ఎస్సీ కమీషన్ సభ్యుని స్థాయికి ఎదిగారు. గిరిజనుల సమస్యల మీద కుంది అవగాహన వుండడం వల్ల దేశ వ్యాప్తంగా టిపిరగా తిరిగి వారు పడుతున్న సమస్యలపై రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ఒక నివేదిక కూడా సమర్పించారు. బిజెపి ప్రభుత్వ హయాంలో పదవిలో నియమితుడైనా కాంగ్రెస్ హయాంలోనూ కొనసాగడానికి ఆయన మంచితనమే కారణం. నిబద్ధతతో చిన్న స్థాయి నుంచి పై స్థాయికి ఎదిగిన నెల్లూరీయునిగా బూదూరు శ్రీనివాసులు ప్రస్థానం అనుసరణీయం.

వాస్తురామచంద్ర నెల్లూరు

డాక్టర్ శేషారెడ్డికి రెడ్ సెల్యూట్!

నెల్లూరు జిల్లాలో మార్క్సిస్ట్ పార్టీకి ఒక మార్గదర్శి; కమ్యూనిజానికి ఒక మానా డాక్టర్ శేషారెడ్డి గారు జీవితం చాలించారని తెలిసి మనసుకు బాధ కల్గింది. వారికి నా రెడ్ సెల్యూట్. ఒక డాక్టర్‌గా, సామాజికవాదిగా ఆయన అనుసరించిన ప్రజాపంథాను అనుసరించమని నెల్లూరులో కమ్యూనిస్టులమని అనుకొనే కొంత మందికి నా సలహా.

తూపిలి వనమాలి హైదరాబాద్

నెల్లూరు ముచ్చట్లు

సోనియాగాంధీ రాక

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ జూలై 17వ తేదీ జిల్లా పర్యటనకు వస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కృష్ణపట్నం పోర్టును సోనియాగాంధీ తన చేతుల మీదుగా ప్రారంభిస్తారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన కుమార్తె పెండ్లి విందు ఇచ్చిన కనుపర్తిపాడు గ్రామ సమీప పొలాల్లో సోనియాగాంధీ బహిరంగసభ నిర్వహించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు తలపోస్తున్నారు. ఈ మేరకు 18వ తేదీ మంత్రులు పిన్నమనేని వెంకటేశ్వరరావు, రామనారాయణరెడ్డి ఈ స్థలాన్ని పరిశీలించి వచ్చారు.

సోనియాగాంధీ పర్యటనను పురస్కరించుకొని 16వ తేదీ ఢిల్లీ నుంచి సెంట్రల్ ఇంటలిజెన్స్ పోలీసులు నెల్లూరు వచ్చి, చేపట్టాల్సిన భద్రతా చర్యలపై ఎస్పీ మల్లారెడ్డితో మాట్లాడారు.

సిటీ బస్సు బోల్తా 30 మందికి గాయాలు

నెల్లూరు కొండాయపాళెం సమీపంలో 15వ తేదీ సిటీ బస్సు బోల్తా కొట్టి రోడ్డు ప్రక్కన కాల్వలో పడింది. పుణ్యక్షేత్రం గొలగమూడి నుంచి బస్సు నెల్లూరు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. 30 మందికి ఓ మోస్తరుగా గాయాలయ్యాయి. బోల్తా కొట్టిన బస్సుకు గొలగమూడి రూట్ పర్మిట్ లేదు. ఈ ప్రమాదానికి రవాణాశాఖ లంచాల కక్కుర్తి కారణమని నిరభ్యంతరంగా చెప్పొచ్చు.

పెన్నలో గుర్తు తెలియని మృతదేహాలు

నెల్లూరు పెన్నానదిలో గుర్తు తెలియని రెండు మృతదేహాలను 16వ తేదీ పోలీసులు గుర్తించారు. 25-30 సంవత్సరాల మధ్య వయస్కులు వీరు. ప్రమాదవశాత్తు నీళ్లలో పడి చనిపోయారా? ఆత్మహత్య చేసుకొన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్ వివాదాల్లో సీతయ్య

నెల్లూరు ఫిఫ్టీటౌన్ ఎస్ఐ సీతయ్య అతిమొచ్చినట్లు డ్యూటీ చేస్తున్నాడు. అడిగినంత డబ్బులిస్తే చాలు ఎటువంటి కేసులోనైనా తలదూర్చి బాధితులకు అన్యాయం చేస్తున్నాడు. ఎస్ఐ వ్యవహార సరళిని పలువురు హైకోర్టు దృష్టికి తీసుక వెళ్లారు. మాగుంట లే అవుట్‌లోని ఓ భూ వివాదంలో జోక్యం చేసుకొన్నందుకుగాను కోర్టు సీతయ్యను మందలించినట్లు తెలిసింది. మరి ఇటువంటి ఎస్ఐని ఎస్పీ గారు ఎందుకు ఉపేక్షిస్తున్నారో?

ఇళ్లను కాల్చుతున్న దొంగల అరెస్ట్

ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి ఆ తర్వాత ఇళ్లను కాల్చి వెళ్తుండిన దొంగలు నగరంలో సంచలనం సృష్టించారు. అయితే వీరి కాలం కలసిరాక పోలీసులకు తొందరగానే దొరికిపోయారు. నెల్లూరు సుందరయ్య కాలనీలోని షాహుల్, ఇస్మాయిల్ ఈ తరహా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది. రామలింగాపురంలోని ఓ ఇంటి దొంగతనంలో వుండగా షాహుల్‌ను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించగా ఇస్మాయిల్ పరారైపోయాడు.

ముగ్గురిని బలిగొన్న అతిసార!

కామెర్ల వ్యాధి నుంచి నెల్లూరు నగర ప్రజలు కోలుకోకముందే అతిసార వ్యాధి బారిన పడి ఈ వారంలో ముగ్గురు మరణించారు. మరో 150 మంది వివిధ హాస్పిటళ్లలో చేరి చికిత్స పొందుతున్నారు. కార్పొరేషన్ కొళాయిల్లో కలుషిత నీరు త్రాగే జనం అతిసార వ్యాధి బారిన పడ్డారు. కార్పొరేషన్ పాలకుల రాజకీయ ఎత్తుగడలు, అధికారులు పైసా వసూల్‌లో పడి జనం సంగతి పట్టించుకోక పోవడం వల్ల నగరంలో ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది.

కళ్యాణ మండపం కట్టించిన జానకిరాం!

తన ఇష్ట దైవం నర్రవాడలోని వెంగమాంబకు మాజీ మంత్రి మాదాల జానకిరాం 30లక్షల రూపాయలు వెచ్చించి ఒక కళ్యాణ మండపాన్ని నిర్మించారు. 26వ తేదీ ఈ కళ్యాణ మండపంలో వెంగమాంబ పేరంటాళ్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మహిళా మంత్రి రాజ్యలక్ష్మమ్మ, సమాచార మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దంపతులు, ఉదయగిరి ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి సతీసమేతంగా పాల్గొంటారు. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే ఈ ఉత్సవాలలో ఈసారి ఉచిత భోజన వసతి కూడా కల్పిస్తున్నట్లు జానకిరాం చెప్పారు.

వివేకాను మారమన్న సోమిరెడ్డి!

నెల్లూరు ఎమ్మెల్యే వివేకానంద రెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల మధ్య ఈ వారంలో మాటల యుద్ధం జరిగింది. మేయర్ తొలగింపుకు ఎమ్మెల్యేకు నోటీసు ఇప్పించిన నేపథ్యంలో సోమిరెడ్డి ఈ విషయాన్ని విలేకరుల సమావేశంలో ప్రస్తావించారు. దీనికి అగ్గిమీద గుగ్గిలమైన ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డిని లిల్లీపుట్ (మరుగుజ్జు) అని వ్యాఖ్యానించారు. దీనికి ప్రతిగా 16వ తేదీ తెలుగుదేశం పార్టీ ఆఫీసులో విలేకరుల సమావేశం పెట్టిన చంద్రమోహన్‌రెడ్డి వివేకాపై తీవ్ర స్వరంతో విరుచుక పడ్డారు. వివేకా... నోరు అదుపులో పెట్టుకో, నన్ను లిల్లీపుట్ అన్నావు. రాజకీయాల్లో ప్రజలకు సేవ చేయడం ముఖ్యం కానీ, ఒడ్డు పొడుగులతో పని లేదు. వామనుడు మూడు అడుగులే; బలి చక్రవర్తిని అధఃపాతాళానికి తొక్కిన విషయం గుర్తుకు తెచ్చుకో. అవాకులు, చెవాకులు ఆపి ప్రజలకు సేవ చేయి, మాట్లాడే భాష మార్చుకోకపోతే ఉప ఎన్నికల్లో తెలంగాణా రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావుకు పట్టిన గతి వివేకాకు పడుతుందని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హెచ్చరించారు.

జడ్పీ ఛైర్మన్ పురస్కారాలు

జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదివి పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఈనెల 22వ తేదీ నగదు పురస్కారాలు అందించనున్నట్లు జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. గత ఏడాది నుంచి గోవర్ధన్‌రెడ్డి ప్రభుత్వ స్కూళ్లలో చదువుకొనే పిల్లలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ పురస్కారాలు అందజేస్తున్నారు. 564 మార్కులు తెచ్చుకున్న నాయుడుపేట విద్యార్థిని సూర్యరజితకు లక్ష రూపాయలు, 561 మార్కులు తెచ్చుకున్న కృష్ణంవల్లి హైస్కూల్ విద్యార్థిని వరప్రసూనకు 75 వేలు, 559 మార్కులు సాధించిన గునపాడు హైస్కూల్ విద్యార్థిని సింధూరికి 50 వేలు అందిస్తారు. 500లకు పైగా మార్కులు సాధించిన 310 మంది విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా సన్మానించి సర్టిఫికేట్లు ఇస్తారు. విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకొన్న హైస్కూళ్ల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులను సన్మానిస్తారు. దర్గామిట్టలోని అనుమాలశెట్టి లక్ష్మణరావు కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

వక్ఫ్ బోర్డు అధ్యక్షునిగా హుస్సేనీ!

జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షునిగా ఎస్.ఎ.ఎం.హుస్సేని నియమితుడయ్యాడు. చాలా రోజులుగా నియామకం జరుగకుండా పెండింగ్‌లో వుండిందీ పోస్టు. హుస్సేనీ నెల్లూరు నగర వాసి. గత 11 ఏళ్లుగా జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా విమర్శలకు తావివ్వకుండా పని చేశాడు.

వక్ఫ్‌బోర్డు జిల్లా కమిటీలో సభ్యులుగా షేక్.జిలానీబాషా (గూడూరు), షేక్.రహంతుల్లా (చిన్నసముద్రం), షేక్.నజీర్ (కొరుటూరు), షేక్.సర్దార్ (నాయుడుపేట), సయ్యద్ దస్తగీర్ బాషా (కావలి), షేక్.జిలానీబాషా (పొదలకూరు), షేక్.రఫియుద్దీన్ (కోవూరు), తాడిచెట్ల నాగూర్ (వింజమూరు),



మద్యం టెండర్లను వ్యతిరేకిస్తూ నెల్లూరులో ప్రదర్శన చేస్తున్న లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు.

షేక్.ఇస్మాయిల్ (అల్లూరు), షేక్.జియాయుద్దీన్ (నెల్లూరు) నియమితులయ్యారు.

జిల్లాలో వందల కోట్ల రూపాయల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమై వున్నాయి. కొత్త బోర్డు అధ్యక్షుడు, సభ్యులు నామ్‌కే వాస్తేగా గాక గట్టిగా పనిచేస్తే పేరు నిలుపుకో గలుగుతారు.

టెలికామ్ అడ్వైజరీ కమిటీ సమావేశం

నెల్లూరులోని జిల్లా టెలికామ్ ఆఫీసులో జరిగిన జిల్లా టెలికామ్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో సభ్యుడు ప్రమిద శీనయ్య, జనం ఇబ్బంది పడుతున్న పలు సమస్యలను జిఎం సి.వి.రత్నం దృష్టికి తెచ్చారు. దీనికి జిఎం స్పందిస్తూ వింజమూరు మండలం చాకలికొండలో అదనపు సెల్ ఫోన్ టవర్ నిర్మాణంలో వుందని ఇది పూర్తయితే ఇక్కడ సెల్‌ఫోన్లు పనిచేస్తాయన్నారు. శాయిపేట, జలదంకి, కొండాపురం, కృష్ణాపురంలలో సెల్‌ఫోన్ టవర్లు నిర్మించినా సాంకేతికంగా వున్న మరికొన్ని సమస్యలను అధిగమించాల్సి వుందన్నారు. కావలి పట్టణంలో బిఎస్ఎన్ఎల్ సెల్‌ఫోన్లు బాగా పని చేయను మరొక సెల్ టవర్ ఏర్పాటు చేస్తామని టెలికాం జిఎం సి.వి.రత్నం హామీ ఇచ్చారు.

రైతు బజారులో పనికిమాలిన బియ్యం

ప్రభుత్వ నిర్ణయాలను అమలు పరిచే దిక్కులేక పథకాలు గబ్బుపట్టిపోతున్నా పట్టించుకొనే నాధుడే లేకుండా పోతున్నారు. బియ్యం రేట్లు అనూహ్యంగా పెరిగిపోయిన నేపథ్యంలో రైతు బజారుల ద్వారా సూపర్ ఫైన్ బియ్యాన్ని కిలో 15 రూపాయల నుంచి 16 రూపాయల వరకు, బి గ్రేడ్ బియ్యాన్ని 14 రూపాయలకు విక్రయిస్తారని ముఖ్యమంత్రి ఘనంగా ప్రకటించారు. రైసు మిల్లర్ల సంఘం నేతృత్వంలో నెల్లూరు ఫత్తేఖాన్‌పేటలోని రైతు బజారులో అమ్మకాలు ప్రారంభమైన తొలిరోజు 16వ తేదీ పరమచెత్త బియ్యాన్ని 16 రూపాయలకే విక్రయిస్తుండేది. సందెట్లో సడేమియాగా తన దగ్గర వున్న చెత్త బియ్యాన్ని రైతు బజార్లలో అమ్ముతూ ప్రభుత్వాన్ని మిల్లర్ల సంఘం గబ్బుపట్టిస్తున్నా అడిగే నాయకులు, అధికారులు లేరు. కారణం రైసు మిల్లర్ల సంఘం నేత అధికార పార్టీ నేత కావడమేనని ప్రత్యేకించి చెప్పనవసరం లేదనుకొంటాం.

ఆర్టీసి ఆర్ఎం బదలీ

నెల్లూరు ఆర్టీసి రీజియన్ మేనేజర్‌గా పనిచేస్తుండిన ఎ.కోటేశ్వరరావు విజయవాడ రీజియన్‌కు బదలీ అయ్యారు. కర్నూల్ రీజియన్‌లో పని చేస్తుండిన ఆర్.ఎం.శేషగిరిరావు నెల్లూరు రీజియన్ మేనేజర్‌గా నియమితులయ్యారు.

కోటేశ్వరరావు పదవీ బాధ్యతలు స్వీకరించాక రీజియన్‌లో నష్టాలు బాగా తగ్గించారు. శేషగిరిరావు నెల్లూరుకు పాత కాపు. గతంలో ఇక్కడ పనిచేసిపోయిన అనుభవంతో రీజియన్‌ను మరింత అభివృద్ధి పరుస్తారని ఆశిద్దాం.

రక్త పరీక్షలకు రాయితీ

నెల్లూరు ఇందిరాభవన్ రోడ్డులోని విజయ లాబొరేటరీ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని షుగర్, బి.పి, కొలస్ట్రాల్ సంబంధిత ఏడు పరీక్షలు 200 రూపాయలకే చేస్తున్నట్లు డాక్టర్ పెంచలరెడ్డి చెప్పారు. అధిక బరువు, లావు తగ్గించుకొనే చికిత్స ఖర్చులో 20 నుంచి 50 శాతం రాయితీ ఇస్తామంటున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలను సద్వినియోగం చేసుకోమంటున్నారు.

గిరిజన విద్యార్థులకు సాయం

కావలి మండలంలోని అదవి రాజుపాళెం ప్రాథమిక పాఠశాలలో

ఈరువ 14వ పేజీలో

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
మేకింగ్ ఛార్జీలపై 10% తగ్గింపు.
గుల్ల జ్యువెలర్స్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
అయ్యప్పగుడి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

స్కూల్స్ మరియు కాలేజిల
యూనిఫాం
మిల్లు ధరలపై 10% డిస్కౌంటు
విమల్ జంక్షన్
కావూవీధి, నెల్లూరు. ఫోన్: 2309199



డాక్టర్ శేషారెడ్డి అంతిమయాత్రలో జన సందోహం.

సుదూర తీరాలకు ప్రజల డాక్టర్!

నెల్లూరు డాక్టర్ల కుల గురువు జెట్టి శేషారెడ్డి గారు మరణించారు. గత నెల రోజులుగా అస్వస్థతతో వున్న ఆయన తేది మద్రాసు విజయా ఆస్పత్రిలో ప్రశాంతంగా కన్ను మూశారు. ఆయన వయస్సు 78 సంవత్సరాలు.

జీవితానికి సార్థకత అంటే ఏమిటో శేషారెడ్డి గారిని చూస్తే అర్థమౌతుంది. వూపిరి పీల్చిన ప్రతి నిముషం, ప్రతి క్షణం సమాజ సేవకు, మానవ శుశ్రూషకు వినియోగించగలగడం ఎంత గొప్ప విషయం? ఊహ తెల్సినప్పటి నుంచి శేషారెడ్డి గారికి ప్రజలు, వారి బాధలు, రోగాలు, సమస్యలు, ప్రజా ఉద్యమాలు తప్ప వేరే పనిలేదు; ధ్యాస లేదు. 1955లో మద్రాసులో మెడిసిన్ చదివి, కాలేజి నుంచి నేరుగా వచ్చి నెల్లూరులో తన మేన మామ డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి నడిపే పీపుల్స్ పాలీక్లినిక్‌లో చేరిపోయాడు. అప్పటి నుంచి తుది ప్రాణం విడిచే వరకు అదే ఆయన కార్యస్థానం. కొన్ని వేలమంది, లక్షలలో కూడా వుంటారేమో, ఆయన చేతి చలవ వల్ల ఆరోగ్యాన్ని సంతరించుకున్నవారు. జిల్లాలోని ఏ మారు మూల గ్రామంలో ఏ పేద వాడికి ప్రాణం మీదకు వచ్చినా, నేరుగా రామచంద్రారెడ్డి ఆస్పత్రికి రావడం ఒక ఆనవాయితీగా అయిపోయింది. ఆయన మీద పేదవారిలో ఎనలేని విశ్వాసం. జేబులో


సుందరయ్యతో శేషారెడ్డి.

చిల్లి గవ్వ లేకున్నా సంకోచం వుండదు; ఎవరి సిఫార్సుల తోనూ పని వుండదు. పేద ప్రజల పాలిట అదొక దేవాలయంగా ప్రసిద్ధి చెందింది. దీనికి పునాదులు వేసిన వాడు డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి అయినా, దాన్ని సర్వ సమగ్ర వైద్య నిలయంగా తీర్చి దిద్దింది శేషారెడ్డి గారే. 1967లో తన మేనమామ మరణించే నాటికి అదొక చెట్టు క్రింద ఆస్పత్రి. ఈ రోజు అందులో 250 పడకలున్నాయి. 46 మంది డాక్టర్లున్నారు. చాలినంత మంది సిబ్బంది వున్నారు. విశాలమైన భవనాలు సమకూరాయి. ప్రాథమిక స్థాయిలో వైద్య పరీక్షలు జరపడానికి తగినంత ఉపకరణాలు, యంత్రాలు వున్నాయి. రామచంద్రారెడ్డి గారి రోజులలో కత్తి దొరకకపోతే బ్లేడ్ పెట్టి కోసి సర్జరీలు చేసే వారని చెప్పుకునే వారు. కానీ శేషారెడ్డి గారు మాత్రం, ఆధునిక వైద్య ప్రక్రియలకు అవసరమైన వసతులన్నీ కార్పొరేట్ ఆస్పత్రులకు తీసిపోని స్థాయిలో సమకూర్చారు. కానీ రోగులకయ్యే ఖర్చు మాత్రం కార్పొరేట్ ఆస్పత్రులతో పోలిస్తే నామ మాత్రం. అంకురితమైన ప్రజాసేవానురక్తి, మొక్కవోని దీక్ష, పట్టుదల, చలించని చిత్తశుద్ధి వుంటే తప్ప ఒక వైపు అభివృద్ధి, మరొకవైపు సేవ సాధ్యం కావు.

తన జీవితం మొత్తాన్ని ఆ ఆస్పత్రి నిర్వహణకు, పేద ప్రజల శుశ్రూషకు అంకితం చేయబట్టి, త్యాగం చేయబట్టి, ధార పోయబట్టే శేషారెడ్డి గారు తన జీవిత కాలంలోనే తన జన్మ సార్థకం అన్పించుకోగలిగారు.

ఆస్పత్రిలో ఒక్క క్షణం ఊపిరి పీల్చుకునే వ్యవధి దొరికినా, ఇంటికి వెళ్లి భార్యా పిల్లలతో గడపాలని చూసే వాడు కాదు. నేరుగా సిపిఎం ఆఫీసుకు వెళ్లి, కార్యకర్తలకు మార్క్సిస్ట్ సిద్ధాంతాల పట్ల విజ్ఞానాన్ని, చైతన్యాన్ని, జిజ్ఞాసను కల్గించడానికి కాలం వెచ్చించేవాడు. జాతీయస్థాయి కమ్యూనిస్టు నేతలతో ఆయనకు వ్యక్తిగత పరిచయాలు, స్నేహ సంబంధాలు వున్నాయి. సారా నిషేధ ఉద్యమంలో, జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలలో, అక్షరాస్యతా ఉద్యమంలో ఆయనది చాలా కీలక పాత్ర.

నెల్లూరులో ఏ కొత్త డాక్టర్ స్వంత క్లినిక్ ప్రారంభించాలన్నా, శేషారెడ్డి గారి చేతికే కత్తెర ఇవ్వడం ఒక ఆనవాయితీ. కుర్ర డాక్టర్లు వైద్యపరమైన సందేహాలతో తన వద్దకు వస్తే, వారికి వైద్య కళాశాలలో కూడా దొరకని వైద్య విజ్ఞానాన్ని సుబోధకం చేసి పంపేవారు. అందువల్లనే నెల్లూరు డాక్టర్లందరూ ఆయన్ను తమ కులగురువుగా భావిస్తున్నారు.

శేషారెడ్డిగారు ధన్య జీవి. ఆయన జీవితం భావి తరాలకు ఆదర్శప్రాయం. ఆయన మరణవార్త విని జిల్లా యావత్తు తల్లడిల్లి పోయింది. గ్రామాల నుంచి ఆయన ద్వారా వైద్య సహాయం పొందిన పేదలు వేల సంఖ్యలో తరలివచ్చారు. కన్నీళ్లతో అంతిమ వీడ్కోలు పలికారు. రామచంద్రారెడ్డి ఆస్పత్రి వున్నంత వరకు, రామచంద్రారెడ్డి, శేషారెడ్డిల స్మృతి సజీవంగా వుంటుంది.


శుభాకాంక్షలు

మా అబ్బాయి ఉద్యోగరీత్యా లండన్‌లోని ప్రముఖ యూనివర్సిటీ CARDIFF UNIVERSITY లో రీసెర్చ్ అసోసియేట్‌గా వెళ్తున్న శుభసందర్భంగా మా హృదయ పూర్వక అభినందనలు.

గుమ్మనేని సాగరేశ్వర్
Research Associate
CARDIFF University
U.K

తండ్రి
గుమ్మనేని ప్రభాకర్
EX. E.O. శ్రీ [illegible]
తల్లి
ఆదిలక్ష్మి నాగరాజమ్మ



మేయర్ తొలగింపు సులభమా?

నెల్లూరు మేయర్ శ్రీమతి పులిమి శైలజకు షోకాజ్ నోటీసు జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పట్టిన పట్టు విడవకుండా సతాయించడంతో, తప్పించుకోలేక, ఆయన ముచ్చట తీర్చాడు ముఖ్యమంత్రి. మేయర్ తొలగింపుకు చట్టంలో అవకాశం వున్న మాట నిజమే. కానీ అందుకు కొన్ని ఆధారాలుండాలి. నియమాలు పాటించాలి. ఇక్కడ అటువంటివేవీ లేవు. మేయర్‌ను తప్పు పట్టడానికి ఒక్క అవినీతి ఆరోపణ లేదు. అయినా సరే షోకాజ్ నోటీసు ఇవ్వాల్సిందే, పదవి నుంచి తొలగించాల్సిందే అన్నది ఎమ్మెల్యే మొండి పట్టుదల. మూడు నెలల పాటు మునిసిపల్ అధికారులందరూ దీన్ని వ్యతిరేకించారు. నసేమిరా వీలు కాదు పొమ్మన్నారు. తప్పు లేకుండా తొలగింపు ప్రయత్నం చేస్తే కోర్టులు తమ జుట్టు రాలగొడతాయని చెప్పారు. కానీ స్వయాన ముఖ్యమంత్రి ఇక తప్పదన్నట్లు ఒత్తిడి చేయడంతో విధిలేక నోటీసు జారీ చేశారు.

అయితే అందులో పస లేదు. ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, కార్పొరేటర్ చాట్ల నరసింహారావు కల్సి ముఖ్యమంత్రికి ఇచ్చిన పిచ్చి ఫిర్యాదులను తిప్పి వ్రాసి షోకాజ్ నోటీసుగా జారీ చేసింది మునిసిపల్ కార్యదర్శి పుష్పా సుబ్రహ్మణ్యం. ఆ నోటీసు చదివిన వారంతా తన ముఖాన ఉమ్మేస్తారన్న నిజం ఆమెకు తెలుసు. కానీ ఆమేమి చేయగలదు పాపం, రాజకీయ ఒత్తిడులకు తల దించుకుని బ్రతికే బానిస మనస్తత్వం ఐఎఎస్‌ల ప్రథమ లక్షణం కదా?

మొత్తం 8 అంశాలు తప్పులుగా చూపించారు ఈ నోటీసులో. మొదటిది, ముఖ్యమంత్రి 2005లో ఇస్తానని చెప్పిన తుఫాను మరమ్మత్తు నిధుల కోసం పిలిచిన టెండర్లను రద్దు చేయమని మేయర్ జాబు వ్రాశారు అన్నది. ముఖ్యమంత్రి నెల్లూరు పర్యటనలో నిధులిస్తానని చెప్పిన మాట వాస్తవమే కానీ, నిధులు మాత్రం ఇవ్వలేదు. కానీ ఆయన పేరు చెప్పి కమీషనర్ టెండర్లు పిలిచాడు. అందుకోసం పనులను ఎంపిక చేయడంలో మేయర్‌తో కనీసపాటి సంప్రదింపు లేదు. ఏ పనులన్నది ఆమెకు చెప్పనే లేదు. ఈ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, కార్పొరేటర్ల అవసరాలకనుగుణంగా పనులను ఎంపిక చేయాలని కోరుతూ జాబు వ్రాశారు మేయర్. అందులో తప్పు ఏమి వుంది? ప్రజా ప్రతినిధులు ఇటువంటి జాబులు వ్రాయడం చాలా సహజం. దాన్ని షోకాజ్ నోటీసులో ప్రథమ తప్పిదంగా పేర్కొనడం ఎంత అన్యాయం?

12వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా అందిన 3 కోట్ల 81 లక్షల నిధులలో 92 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టారని, తతిమా వాటికి మంజూరు ఇవ్వడంలో జాప్యం చేసింది కాబట్టి, మేయర్ ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించిందన్నది రెండవ ఆరోపణ. ఈ పనులను మంజూరు చేయాల్సింది స్టాండింగ్ కమిటీ. దాని ఎన్నికలు జరపకుండా ఎమ్మెల్యే వివేకానందరెడ్డి రెండేళ్ల నుంచి వాయిదా వేస్తున్నాడు. స్టాండింగ్ కమిటీ అనేది లేనప్పుడు, అది మంజూరు చేయవల్సిన పనులను మేయర్ ఎట్లా ఆమోదించగలదు?

మేయర్ పులిమి శైలజకు మునిసిపల్ కార్యదర్శి పుష్పా సుబ్రహ్మణ్యం జారీ చేసిన షోకాజ్ నోటీసులోని అంశాలను చదివితే ఎవరికైనా నివ్వెరపాటేం కాయం.

పులిమి వెంకటరెడ్డి అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి సంబంధించి 1994లో ఆమోదం పొందిన లే అవుట్ ప్లాన్ ఫైల్‌ను మునిసిపల్ ఆఫీసు సిబ్బంది నుంచి మేయర్ దౌర్జన్యంగా తీసుకుని, తన ఛాంబర్‌లో పెట్టుకున్నారన్నది. మునిసిపల్ సిబ్బంది మీద దౌర్జన్యం చేసే పరిస్థితిలో మేయర్ వున్నదా? ఒకవేళ వున్నా 1994లో అనుమతి ఇచ్చిన ఫైల్‌తో ఇప్పుడేమి పని? ఆఫీసు నుంచి ఒక ఫైల్ తీసుకోవడం, మేయర్ పదవి నుంచి తొలగించాల్సినంత నేరమా?

కౌన్సిల్ సమావేశాల అజెండా చట్టం ప్రకారం మునిసిపల్ కార్యదర్శి పేరిట జారీ కావాలని, కానీ మేయర్ తన సంతకంతోనే వాటిని కార్పొరేటర్లకు పంపింది కాబట్టి, పదవి నుంచి తీసి పారేస్తామని నోటీసులో పేర్కొన్నారు. ఎంత నవ్వు లాట విషయం ఇది? నెల్లూరు కార్పొరేషన్‌లో కార్యదర్శి అనే పోస్టు లేదు. అజెండా మీద సంతకం పెట్టే అధికారం మేయర్‌కు చట్టంలోనే వుంది. అనలుకే లేని సెక్రటరీ చేత అజెండా ఎట్లా వంపుతారు?

ఒక స్థలం యజమాని చేసిన విజ్ఞప్తి మేరకు, ఆయన స్థలానికి నివాస ప్రాంతం నుంచి వాణిజ్య ప్రాంతంగా మార్చడానికి ఇన్‌యాంటిసిపేషన్ ఉత్తర్వులు జారీ చేశారని ఒక ఆరోపణ; ఇటువంటి ఫైలుకు సంబంధించే మరొకరు వస్తే, దానికి ఇన్‌యాంటిసిపేషన్ ఇవ్వకుండా కౌన్సిల్ ఆమోదం కోసం అజెండాలో చేర్చాడన్నది మరొక ఆరోపణ. ఎవరు విన్నా నవ్వి పోయే ఆరోపణలివి. కౌన్సిల్ సమావేశాలు సక్రమంగా జరపడం లేదన్నది చివరి ఆరోపణ. గత రెండున్నర ఏళ్లలో పదిసార్లకుపైగా సమావేశాలు జరిగాయి. కౌన్సిల్ సమావేశాలు ఒక సంవత్సరంలో ఇన్నిసార్లు జరపాలన్న నియమం చట్టంలో లేదు. కొన్ని కార్పొరేషన్లలో ఏడాదికి రెండు సార్లు కూడా సమావేశాలు జరపలేదట. సరాసరిన ఏడాదికి ఐదు సార్లు సమావేశాలు జరిపిన మేయర్‌ను పదవి నుంచి తొలగిస్తారట.

ఈ నోటీసులో మరింత విచిత్రం ఏమిటంటే, మేయర్‌గా మిమ్మల్ని తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది కాబట్టి ఈ నోటీసు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. తొలగింపుకు ఒక సారి నిర్ణయం తీసుకున్న తర్వాత ఇక నోటీసుతో పనేమి వుంది. దానికి ఆమె సమాధానం చెప్పవల్సిన అవసరం ఏమి వుంది?

మొత్తం మీద మేయర్ తొలగింపుకు రంగం సిద్ధం చేశాడు ఎమ్మెల్యే వివేకానందరెడ్డి. ఆమెను తొలగించిన వెంటనే కొత్త మేయర్ ఎంపికకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. అందుకు తగిన బలం కాంగ్రెస్ పార్టీకి లేదు కాబట్టి, తెలుగుదేశానికి చెందిన ఏడుగురు కార్పొరేటర్లకు భారీ నజరానా లిచ్చి, తన వైపు తిప్పుకున్నాడని తెలుస్తున్నది. బిజెపికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు ఇప్పటికే ఆయన దివాణంలో ఉద్యోగం చేస్తున్నారు. వీరందరి మద్దతుతో తనకు ఇష్టులాలైన భానుశ్రీని మేయర్ కుర్చీలో కూర్చోబెట్టి మురిసి పోవాలన్నది ఆయన అభిలాష. అయితే అదంత సులభంగా జరిగే పనా అన్నది వేరే విషయం. దుర్న్యాయంగా, దుర్మార్గంగా, అపహాస్యపు రీతిలో తనకొచ్చిన షోకాజ్ నోటీసును హైకోర్టులో సవాలు చేయడానికి సిద్ధమౌతున్నది మేయర్ పులిమి శైలజా రెడ్డి. బహుశా ఈ పత్రిక పాఠకుల చేతికందే సమయానికి హైకోర్టులో ఈ కేసు విచారణకు రావచ్చు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే రాజకీయ దురాగతాలను హైకోర్టులు అనుమతించవన్నది అందరి అంచనా.



నీతిలేని నీటి వ్యాపారం!

పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అవినీతి కారణంగా త్రాగునీటి తయారీ ప్లాంట్ల నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో వున్న తాగు నీటి సమస్యను ఆసరాగా చేసుకుని పరిశుభ్రంగా లేని త్రాగునీటిని విక్రయించి కోట్ల రూపాయలు గడిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా విచ్చల విడిగా నెలకొల్పి వున్న వాటర్ ప్లాంట్లను అధికారులు కనీసం పర్యవేక్షించకపోవడం కూడా వీటి నిర్వాహకులకు బాగా కలసి వస్తుంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఏర్పాటు కావల్సిన త్రాగునీటి తయారీ పద్ధతులను వీరు తుంగలో తొక్కుతున్నారు.



నిఖార్సుగా లేని నీటి తయారీ ప్లాంటు.

వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయదలచుకున్న వారు ముందుగా జిల్లా పరిశ్రమల శాఖ నుంచి అనుమతి పొందాలి. తాగునీటి కోసం సూచించిన ప్రాంతంలో బోర్‌ను వేయాలన్నా కూడా "వాల్టా" అధికారుల నుంచి కూడా ముందస్తు అనుమతి పొందాల్సి వుంటుంది. వాటర్ ప్లాంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత ఇక్కడ లభించే నీరు త్రాగేందుకు అనుకూలంగా వుంటుందా? లేదా? అనే విషయాన్ని తెలుసుకోను నీటి నమూనాలను లేబొరేటరీకి పంపి పరీక్షించాలి. ఇవన్నీ కూడా వాటర్ ప్లాంటు ప్రారంభానికి ముందు జరగాల్సివుంది. వాటర్ ప్లాంట్‌లో తయారుచేసిన నీటిని ప్యాకెట్లు, బాటిల్స్‌లో నింపి విక్రయించాలంటే వాటి తూకాన్ని తూనికలు, కొలతల శాఖ నిర్ధారించాలి.

ప్లాంట్లను సీజ్ చేయాలి!

దుమ్ము ధూళితో నిండిన తాగునీటిని మార్కెట్లో విక్రయిస్తున్న వాటర్ ప్లాంట్లను ప్రభుత్వం సీజ్ చేయాలి. ప్రభుత్వ శాఖ అధికారులు ఇటువంటి కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదు.



వాటర్ ప్లాంట్ల యజమానుల నుంచి మామూళ్లు తీసుకుని నిబంధనల గురించి పట్టించుకోవడం లేదు. ముందుగా అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి.

ఎన్.సుజిత్, నెల్లూరు.

తూనికలు, కొలతల శాఖ అధికారులు ప్లాంట్‌ను పర్యవేక్షించి, ప్యాకెట్ తూకం, బాటిల్ తూకాలను ధృవీకరించిన అనంతరం వాటిని మార్కెట్లో విక్రయించాలి. అలాగే ఐఎస్ఐ గుర్తింపు పొందాలంటే వాటర్ ప్లాంట్‌లో బయో ప్లాంట్, కెమిస్ట్ వుండాలి. దీని గుర్తింపు కోసం డివ్యూటీ డైరెక్టర్ ప్లాంట్‌ను తనిఖీచేసి నిబంధనలకు అనుకూలంగా వాటర్ ప్లాంట్ నిర్మాణం జరిగిందా? లేదా? ఇక్కడ ఉత్పత్తి చేసిన నీరు ఆరోగ్యకరంగా వుందా? లేదా? అని పరిశీలించిన తర్వాతనే ఐఎస్ఐ గుర్తింపు ఇస్తారు. అదే విధంగా వాటర్ ప్లాంట్ నిర్మాణంలో ఏదైనా లోపాలుంటే సరిదిద్దేందుకు కూడా అవకాశం ఇస్తారు.

ఐఎస్ఐ గుర్తింపు కోసం ప్లాంట్ సామర్థ్యాన్ని బట్టి వెయ్యి లీటర్లకు 20 రూపాయల వంతున లైసెన్స్ ఫీజు వసూలు చేస్తారు. నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు భారీ వ్యయం అవుతుంది. ఇంత ఖర్చు భరించేందుకు సిద్ధంగా లేని నిర్వాహకులు నిబంధనలకు వ్యతిరేకంగా వాటర్ ప్లాంట్‌ను నిర్మించి నాణ్యతాప్రమాణాలు లేని తాగునీటిని బయట మార్కెట్లో విక్రయించి అనతి కాలంలో కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు.

తనిఖీలు చేయాలి!

తాగునీటిని సక్రమంగా శుద్ధి చేయకుండా ప్యాకెట్లు, బాటిల్స్ ద్వారా మార్కెట్లో విక్రయిస్తున్న పరిశ్రమలను అధికారులు తనిఖీ చేయాలి. వివిధ శాఖల అధికార్లు పర్యవేక్షణ లోపించడంతో పరిశ్రమల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బోరు బావుల్లోని నీటినే ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు.



ఎం.ప్రసాద్, నెల్లూరు.

బోర్ నుంచి మోటర్ల ద్వారా నీటిని తీసి ఎటువంటి పరీక్షలు చేయకుండానే విక్రయిస్తున్నారు. మొత్తం జిల్లాలో 40 వరకు వాటర్ ప్లాంట్‌లు వుండగా వీటిలో కేవలం 20 వాటర్ ప్లాంట్లకు ఐఎస్ఐ గుర్తింపు వుండడం గమనార్హం. మిగిలిన వాటికి ఐఎస్ఐ గుర్తింపు లేకపోయినా వున్నట్లు వాటర్ ప్యాకెట్లపై ముద్రించేస్తున్నారు. ఆహార పదార్థాలలో తాగునీరు కూడా ఒక భాగం. తాగునీరు ఆరోగ్యకరంగా వుందా? లేదా? అని నిత్యం పరిశీలించాల్సిన బాధ్యత ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌దే. అయితే ఏ అధికారి ఏనాడు కూడా వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసిన సందర్భాలు లేవు.

నెల్లూరు కార్పొరేషన్, గూడూరు, కావలి, వెంకటగిరి మునిసిపాలిటీలతో పాటు జిల్లాలోని పలు మేజర్ పంచాయితీలు పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు అందించలేకున్నాయి. ఈ దశలో రంగ ప్రవేశం చేసిన మినరల్ వాటర్ వ్యాపారులు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తూ ప్రామాణికాలు పాటించని నీటిని క్యాన్లలో నింపి మార్కెట్‌కు పంపి లక్షలార్జిస్తున్నారు.

వేసవి కాలం వచ్చిందంటే చాలు వాటర్ ప్యాకెట్లు, బాటిల్స్‌కు మంచి గిరాకీ ఏర్పడుతుంది. ప్రజలకు అవసరమైన తాగునీరు సరఫరా సరిగా లేకపోవడంతో మార్కెట్లో లభించే వివిధ కంపెనీల వాటర్ ప్యాకెట్లు, క్యాన్‌లను ప్రజలు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్ని కంపెనీలు తయారు చేసిన వాటర్ క్యాన్లలో దుమ్ము, ధూళి వుంటున్నాయి. వాటర్ ప్లాంట్లు నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు పాటించని విషయం అన్ని శాఖల అధికార్లకు తెలిసినా వీటి నిర్వాహకులపై చర్యలు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు.

దృష్టి సారించాలి!

జిల్లావ్యాప్తంగా తాగునీటిని నిబంధనలు పాటించకుండా విక్రయిస్తున్న వాటర్ ప్లాంట్ల నిర్వాహకులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. ప్యాకెట్లు, క్యాన్లలో నింపి విక్రయిస్తున్న తాగునీటిలో దుమ్ము, ధూళి వుంటుంది. వీటిని తాగిన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.



శ్రీకాంత్, నెల్లూరు.



ఈ నీటి క్యాన్లకు భలే డిమాండ్.

జిల్లా కలెక్టర్‌గా పనిచేసి బదలీపై వెళ్లిన రవిచంద్ర వాటర్ ప్లాంట్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కేవలం ఐఎస్ఐ గుర్తింపు పొందిన వాటిని మినహాయించి గుర్తింపు లేని వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన సంఘటనలున్నాయి.

ప్రస్తుత జిల్లాకలెక్టర్ రాం గోపాల్ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న వాటర్ ప్లాంట్లపై ఎందువల్లో దృష్టి సారించలేకపోతున్నారు. దీంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నెల్లూరు కార్పొరేషన్, కావలి, గూడూరు, వెంకటగిరి మునిసిపాలిటీలలో తాగునీరు సరఫరా సక్రమంగా జరగకపోవడంతో ప్రతి ఒక్కరూ వాటర్ క్యాన్లను కొనుగోలు చేయక తప్పడం లేదు. నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవడంతోపాటు, వీటిని పర్యవేక్షించని సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

జమీన్‌రైతుతో జీవితానుబంధం

జమీన్‌రైతు తెలుగు వారపత్రిక మరి కొద్ది నెలల్లో 80వ సంవత్సరంలో అడుగిడబోతున్నది. తెలుగు పత్రికా చరిత్రలో ఇదొక సువర్ణ ఘట్టం. ఇంత సుదీర్ఘ కాలం స్వల్ప అంతరాయం కూడా లేకుండా, నిర్విఘ్నంగా నడిచిన తెలుగు పత్రిక మరొకటి లేదు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వంటి ప్రపంచ స్థాయి నేతలు స్థాపించిన పత్రికలే (నేషనల్ హెరాల్డ్) వ్యాపార విషవలయాన్ని చేధించలేక సహజ మరణం చెందుతున్న గడ్డ మీద, ఆశయ బలం తప్ప అంగ, అర్థ బలాలు లేని 'జమీన్‌రైతు' నజీవంగా, సగర్వంగా పత్రికా లోకం చరిత్రలో సమున్నత స్థానం అలంకరించడం ఎంత గొప్ప సంగతో వివరించనవసరం లేదు.

గుండె ఉప్పొంగే ఈ సంతోష సంబరాన్ని, ఈ ఘనత సాధించడానికి ఊతమిచ్చిన పాఠక దేములతో పంచుకోవాలన్నది మా అభిలాష. దశాబ్దాలుగా తిరుగులేని విశ్వాసంతో, తరిగిపోని అభిమానంతో జమీన్‌రైతును ఆదరిస్తున్న పాఠకులతో జీవిత కాలపు అనుబంధం నెరపాలన్నది మా అభిమతం. అందుకోసం 'జీవిత చందా' ను ప్రవేశపెడుతున్నాము. కేవలం రూ1000లు (వెయ్యి రూపాయలు) చెల్లించి జీవిత కాలం పాటు జమీన్‌రైతు వారపత్రికను స్వీకరించే సౌకర్యం కల్పిస్తున్నాము.

నెల్లూరు జిల్లా జనజీవితంతో జమీన్‌రైతు మమేకత విడదీయరానిది. ఆత్మకూరులో వున్నా, అమెరికాలో వున్నా జమీన్‌రైతు చదవాలని తోరుకొనే వేలాది పాఠకులు ఈ 80వ వార్షికోత్సవ కానుకను స్వీకరించాలని మనవి చేస్తూ, జీవిత కాలం పాటు ఈ అనుబంధం శాశ్వతంగా కొనసాగాలని అభిలషిస్తున్నాము.

జీవిత చందాదారులు కావాలన్న ఆసక్తి మీకు వుంటే 98489 66190 నంబరుకు ఫోన్ చేయండి!

జీవిత చందా :	రూ.1000లు
సంవత్సర చందా	
స్వదేశంలో :	రూ. 200లు
విదేశాలకు :	రూ.1000లు


రాజకీయం నేర్పిన ఎమ్పీడిఓ!

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లుగా వుంది కలువాయి ఎంపిడిఓ ఇందిరమ్మ పరిస్థితి. మండలంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పనుల్లో అవినీతిని గురించి పట్టించుకోని ఆమె, ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న చేజర్ల మండలంలో జరిగిన జాతీయ ఉపాధి

అధికార పక్షానికి అనుకూలం ప్రతిపక్షానికి వ్యతిరేకం

హామీ పనుల్లో అవినీతిని బయటపెట్టి అధికార పార్టీ నాయకుల మెప్పు పొందింది. మండలంలో కేవలం నాలుగు గ్రామాల్లో జరిగిన అవినీతిని కాదని, మొత్తం మండలంలో జరిగిన పనుల్లో అవినీతిని బయట పెట్టాలని ఆత్మకూరు ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు పట్టుపట్టడంతో ఎంపిడిఓ ఇరుకున పడింది. కొమ్మి వర్గీయులు అవినీతి పరులని తేల్చి అధికార పార్టీ నాయకుల ఆశీస్సులు పొందిన ఆమె

కొరవ 14వ పేజీలో



బ్యాంకర్ల జిల్లా స్థాయి సమితి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాంగోపాల్. ఫోటోలో ఇందిర క్రాంతి పథం ప్రాజెక్ట్ డైరక్టర్ చెన్నకేశవరావు, బ్యాంకర్లు వున్నారు.

ఇందుకూరుపేట సబ్‌ట్రెజరీలో అవినీతి జమానా

ఇందుకూరుపేట సబ్ ట్రెజరీ కార్యాలయం అవినీతి అడ్డాగా మారింది. కార్యాలయంలో ఏ పని జరగాలన్నా అధికారికి ముడుపులు అందించాల్సిందే. మామూళ్లు ఇవ్వకపోతే ఎన్ని రోజులైనా ఫైళ్లు దుమ్ము కొట్టుక పోవడం తప్ప ముందుకు కదలవు. ఈ సబ్ ట్రెజరీ కార్యాలయానికి రెగ్యులర్ అధికారి లేకపోవడంతో, జిల్లా ట్రెజరీ నుండి సీనియర్ అధికారి గుప్తాను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతి పనికి రేటు పెట్టి డబ్బులు గుంజుతున్నాడనే ఆరోపణలు ఎక్కువయ్యాయి. ఇతర సిబ్బంది ప్రమేయం లేకుండానే అన్ని తానై వ్యవహరిస్తూ లంచాల సొమ్ము తెగ గుంజుతున్నాడు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేసేందుకు వేలాది రూపాయలను

పైసలిస్తేనే ఫైలు కదిలేది!

మామూళ్ల రూపంలో పుచ్చుకొంటున్నాడనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినపడుతున్నాయి. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ, పంచాయితీ రాజ్, ఐసిడిఎస్‌ల సిబ్బందికి సంబంధించి టిఏ బిల్లులు, అరియర్స్ మంజూరు చేయడం కోసం 10శాతం లెక్కన కమీషన్ తీసుకొన్నారన్నది విశ్వసనీయ సమాచారం. కార్యాలయంలోని రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ట్రెజరీ డిడి, ఈ అధికారికి రెండుసార్లు మెమో ఇచ్చినా ఏ మాత్రం మారులేదు. సబ్ ట్రెజరీ అధికారి గుప్తా మాత్రం తమ కార్యాలయాల్లో అవినీతికి ఆస్కారం లేదని, కొందరు పని గట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని చెబుతున్నారు.

నత్త నడకన ఓటర్ల నమోదు

ఆత్మకూరు మండలంలో ఫోటో

కొరవ 14వ పేజీలో


బుచ్చి కాలేజీల స్పెషల్ ఆఫర్!

బుచ్చిరెడ్డిపాళెంలో ప్రైవేట్ కళాశాలల మధ్య వ్యాపారపరమైన పోటీ విద్యార్థులకు, తల్లితండ్రులకు చికాకు కల్గిస్తుంది. ఒకరికి ఒకరు పోటీపడి వస్త్ర వ్యాపారుల మాదిరిగా రకరకాల ఆఫర్లను ఇస్తుండడంతో పదవ తరగతి పాసైన విద్యార్థులు ఎక్కడ చేరాలో తెలియని అయోమయ పరిస్థితిలో వున్నారు.

స్కాలర్ షిప్పు లిస్తారట పరీక్ష ఫీజులు కదతారట

పట్టణంలో గుత్తికొండ శ్రీరాములు, సిద్ధార్థ, కార్, విజ్ఞాన జ్యోతి కాలేజీలు వున్నాయి. ఈ సంవత్సరం విజ్ఞాన జ్యోతి కళాశాలను గుత్తికొండ శ్రీరాములు కాలేజీ యాజమాన్యం కొనుగోలు చేసింది. దీంతో విద్యార్థులను చేర్చుకొనే విషయంలో ప్రధాన పోటీ సిద్ధార్థ, శ్రీరాములు కళాశాలల మధ్య నెలకొనింది. మా కాలేజీలో చదివితే చక్కని విద్యను అందిస్తామని, విద్యార్థులకు ఎప్పుడో వచ్చే స్కాలర్ షిప్పులను ముం

కొరవ 14వ పేజీలో



నెల్లూరు కళాకారుడు సురభి వనారస లక్ష్మీకాంత్‌ను గరుడ అవార్డుతో సత్కరిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి జి.రత్నాకరరావు. ప్రక్కన తిరుపతి ఎమ్మెల్యే వెంకటరమణ వున్నారు.



జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా నియమితుడైన హుస్సేనీకి నియామక పత్రాన్ని అందిస్తున్న డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి.

కలువాయిలో దిక్కులేని దేశం

కలువాయి మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకత్వ సమస్యను ఎదుర్కొంటున్నది. పార్టీని ముందుడి నడిపించే నాయకుడు లేక కార్యకర్తలు, పార్టీ కేడర్ నిస్తేజమైంది. అధికార కాంగ్రెస్ పార్టీకి ధీటుగా ప్రజలతో మమేకమై టిడిపిని బలోపేతం చేసే నాయకులు లేక పార్టీ ప్రజల ఆదరాభిమానాలకు దూరమౌతుంది. మండలంలోని నాయకులు సొంత వ్యాపారాలతో ప్రక్క రాష్ట్రాలకు వలస పోగా, అరువుకు తెచ్చుకొన్న నాయకులు సైతం అందుబాటులో లేక కలువాయి దేశం తమ్ముళ్లు దిక్కులేని వారయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఓటమికి పార్టీలోని వెన్నుపోట్లే ప్రధాన కారణమని భావించిన మాజీ ఎంపిపి

వ్యాపారాలలో నాయకులు బిజీ

అనిలకుమార్‌రెడ్డి కాంట్రాక్టు పనులపై కర్నాటకకు వెళ్లడంతో తెలుగుదేశాన్ని ముందుండి నడిపించే నాయకుడే కరువయ్యాడు. ప్రజలకు పేరు కూడా తెలియని మండల పార్టీ కన్వీనర్ రమణయ్యనాయుడు కేరాఫ్ నెల్లూరు అయ్యాడు. గ్రీవెన్స్‌డే రోజున గెస్ట్ లీడర్‌లాగా కలువాయికి వచ్చి పోతున్నాని

కొరవ 14వ పేజీలో

ఆత్మకూరులో పింఛన్ల స్వాహా

ప్రభుత్వం ఇందిరమ్మ ఫించన్ల పేరుతో ప్రవేశపెట్టిన పథకానికి అన్ని ప్రాంతాలలోనూ అవినీతి చెద పడుతుంది. అడుగడుగునా మోసాలే. ఈ పింఛన్ల పంపిణీని సంఘ బంధం మహిళలకు అప్పగించడంతో వారు ఆడింది ఆట్టైంది. ముఖ్యంగా ఆత్మకూరు మండలంలో సంఘ బంధ మహిళలు తమకు ఇష్టం వచ్చిన వారికి పింఛన్లు అందజేసి, జాబితాలో పేర్లు వున్న పలువురికి ఇవ్వకుండా వారే వారి పేర్లతో వేలిముద్రలు వేసి పింఛను సొమ్మును దిగమింగుతున్నారు. ఇందిర క్రాంతి పథకం సిబ్బంది వీరితో కుమ్మక్కై ఫించను దార్లను నిలువునా దోచుకొంటూ వారి నోటికాడ సొమ్మును గుటకాయస్వాహా

సంఘ బంధాల తీరిది

చేస్తున్నారు. ఈ విషయంపై గతంలో ఆత్మకూరు ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు పెద్ద ఎత్తున ఆరోపణలు చేసినా పట్టించుకొనే అధికారే లేకపోవడంతో ఫించన్ల దోపిడీకి అడ్డు ఆపు లేకుండా పోయింది. అనంతసాగరం మండలంలోని కొత్తపల్లిలో గ్రామ సంఘ బంధం నాయకురాలు

కొరవ 14వ పేజీలో



జిల్లాలో బాల కార్మికులు లేకుండా చేస్తామని బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రతిన చేస్తున్న జిల్లా కలెక్టర్ రాంగోపాల్, ఎస్పీ మల్లారెడ్డి, డిఇఓ భార్గవ, చెన్నకేశవరావు, కార్పొరేషన్ కమీషనర్ అంజనేయులు తదితరులున్నారు.

ప్రసూతి ఆస్పత్రికి అసౌకర్యాల రోగం

మంచాలు లేక నేలపైనే రోగుల పడక

గతమెంతో ఘనకీర్తి కల్గిన నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్ద గల ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి ప్రస్తుతం శని పట్టినట్లుంది. ఈ ఆసుపత్రికి గర్భిణులు ఎక్కువ సంఖ్యలో వస్తుండే విషయాన్ని పరిగణలోనికి తీసుకొని ప్రభుత్వం కొంతమేర నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రత్యేక వార్డులను నిర్మించారు. అయితే ఈ వార్డులలో మంచాలు లేవు, ఫ్యాన్లు లేవు. మరో గతిలేక గర్భిణీ స్త్రీలు దాపలపై పడుకోవాల్సి వస్తుంది. ఇవి లేనివారు కటిక నేలపై పడుకొని వుంటున్న దృశ్యాలు చూస్తే కళ్లు చెమర్చక మానవు.

ఈ అసౌకర్యాల నడుమ లంచాల కోసం హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది బీదాబిక్కిని జలగల్లా తగులుకోవడం విమర్శలకు తావిస్తుంది. కాన్పు అయిన మహిళకు చీర మార్చను ఆయాకు 50 రూపాయలు, పురిటి బిడ్డకు స్నానం చేయిస్తే మరో 50 రూపాయలు ఇవ్వాలి. ఆపరేషన్ చేయాలంటే డాక్టర్లు అడిగిన మొత్తం ఇచ్చాకే టేబుల్ దగ్గరకు వస్తారు. బాలింతలు ఇంటికి వెళ్లే సమయంలో వార్డుల్లో పనిచేసే ఆయాలు, తోటీలకు చేయి తడిపితేనే బయటకు పంపుతారు. ఈ ఆసుపత్రికి వచ్చే వారంతా గతిలేని దరిద్రులు. వీరిపట్ల కూడా కరుణచూపని హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బందిని ఏమనాలో అర్థం కావడం లేదు. అదే విధంగా కొత్తగా కట్టిన వార్డుల్లో మంచాలు, ఫ్యాన్లు వేయించలేని ఘనత వహించిన ప్రజాప్రతినిధులు ఎంత గొప్ప హృదయులో వివరించనక్కర లేదనుకొంటాం.



ఎరువుల కొరతతో రైతుల్లో ఆందోళన

స్పందనలేని వ్యవసాయ శాఖ

జిల్లాలో రసాయనిక ఎరువుల కొరత ఏర్పడింది. జిల్లా రైతాంగం రెండవ పంటకు సిద్ధమవుతున్న తరుణంలో వ్యవసాయానికి అవసరమైన ఎరువుల కొరత రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. ప్రస్తుతం యాభై వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్న రైతాంగానికి అవసరమైన ఎరువులను సిద్ధం చేయడంలో వ్యవసాయశాఖ పూర్తిగా విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లాకలెక్టర్ పలు మార్లు రైతులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా చూడాలని వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా వారిలో ఏ మాత్రం చలనం లేదు. రెండవ పంటకు ఎన్ని టన్నుల ఎరువులు అవసరం అనే దానిపై ఎలాంటి సమాచారం అధికారుల వద్ద లేకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నది. ఎరువుల కొరతను ఆసరాగా చేసుకొని ఎరువుల అమ్మకందారులు అధిక ధరలకు వీటిని విక్రయిస్తుండడంతో చేసేది లేక వ్యాపారులు చెప్పిన ధరలకే రైతులు కొనుగోలు

తరువ 14వ పేజీలో



అశోక్‌కుమార్‌ను మర్యాదగా కూర్చోబెట్టి ఇంటరాగేషన్ చేస్తున్న టూ టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసరావు.

నయవంచకుడికి ఎమ్మెల్యే అండదండలు

బుజబుజనెల్లూరు యువతికి అన్యాయం చేసిన పోలీసులు

శాస్త్రబద్ధంగా పెద్దల సమక్షంలో యువతిని పెళ్లాడి చెప్పాపెట్టకుండా అమెరికాకు చెక్కేసిన ప్రబుద్ధుడిని నానా పాట్లు పడి నెల్లూరు పోలీసులకు పట్టిస్తే, వారు ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ఫోన్ కాల్‌తో విడిచిపెట్టేసిన విషయం నగరంలో చర్చనీయాంశమయ్యింది. బుజబుజనెల్లూరుకు చెందిన హరితకు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్న అశోక్‌కుమార్‌తో వివాహం జరిగింది. పెళ్లయి పదిహేను రోజుల పాటు భార్యతో కాపురం చేసిన అశోక్‌కుమార్ హైదరాబాద్ వెళ్లి వస్తానని హరితకు చెప్పి అమెరికాకు వెళ్లిపోయాడు. ఈ మధ్య ఈ ప్రబుద్ధుడు చెన్నై వచ్చి వున్నాడన్న సమాచారంతో హరిత బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండవ నగర పోలీసులు చెన్నై వెళ్లి అతడ్ని అదువులోనికి తీసుకొని విచారించే సమయంలోనే అతను కెమెరాలకు తన మొహం కనపడకుండా జాగ్రత్త పడ్డాడు. పోలీసులు స్టేషన్‌లో అతనికి రాచమర్యాదలు చేశారు. పెద్ద మనిషిగా పేరుగాంచిన సిఐ వీరాంజనేయ రెడ్డి, అశోక్‌కుమార్‌ను ముగ్గురు వ్యక్తుల వూచికత్తుతో అర్ధరాత్రి అకస్మాత్తుగా వదిలేశారు. దీనికి కారణం ఏమిటని ఆరాతీస్తే ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ఫోన్ కాల్ అని తేలింది. పాపం హరిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యేతోపాటు, పోలీసులను ఎదుర్కొనే శక్తి లేదు. ఒక యువతి జీవితాన్ని చిందరవందర చేయనా అధికారాన్ని ఉపయోగించేది?

పెద్దాస్పత్రిలో రక్షణ కరవు!

అరాచక శక్తులదే రాజ్యం

నెల్లూరు పెద్దాసుపత్రిలో రోగులకు రక్షణ కరువైంది. అరాచక శక్తులు ఆసుపత్రిలో రోగులను, వారి సహాయకులను వేధించడం, బంగారు నగలు లాక్కెళ్లడం జరుగుతుంది. పది రోజుల క్రిందట ఓ మహిళ ఆమె తరపున బంధువులు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా తోడుగా వచ్చింది. హాస్పిటల్‌లోని మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో ఆవరణలోని చెట్లలోనికి బహిర్భూమికి వెళ్లింది. ఇంతలో ముగ్గురు అగంతులు అడ్డుపడి ఆమె ఒంటిపై బంగారు నగలు లాక్కెళ్లిపోయారు. ఆసుపత్రికి ఎవరు వస్తున్నారు... ఎప్పుడు తిరిగి పోతున్నారని పరిశీలించే నాధుడే లేడు. ఆసుపత్రిలో మంచి చెడ్డలు పరిశీలించాల్సిన సిబ్బందే చీకటి పడ్డాక రూముల్లో మద్యం సేవిస్తూ కనపడుతున్నారు. రోగులకు సహాయకులుగా వుండే మహిళలను ఇక్కడ పనిచేసే సిబ్బందే వేధిస్తున్నారు. ఆసుపత్రిలోని వివిధ వార్డుల్లో ఇప్పటికే లెక్కలేనన్ని సార్లు దొంగతనాలు జరిగాయి. మహిళలపై దౌర్జన్యానికి దిగిన సందర్భాలున్నాయి. ఆసుపత్రి గేట్లు 24 గంటలు తెరచి వుండడం సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడం వల్ల ఎవరుపడితే వారు లోనికి వచ్చేస్తున్నారు. ఆసుపత్రి చుట్టూ పెరిగిన చెట్లలో కూర్చొని హాయిగా చీట్లాట ఆడుతున్నారు. ఈ అరాచక శక్తులు చాలదన్నట్లు గతవారం ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగులు కొందరు సూపరింటెండెంట్ గది తాళాలు పగులగొట్టి అందులో వున్న నగదు, రికార్డులను దొంగిలించుక వెళ్లారు. పెద్దాసుపత్రిలో పరిస్థితులు మెరుగు పర్చను ఈ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ అయిన జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్ రెడ్డి ఒక కార్యాచరణ రూపొందిస్తే బాగుంటుంది.

10వ వర్ధంతి

కీర్తిశేషులు, మాననీయ

పర్వతరెడ్డి బాబుల్ రెడ్డి గారు

(రాజ్యసభ మాజీ సభ్యులు, హైదరాబాద్)

మీరు మమ్మల్ని వీడి పరలోకాలకు వెళ్ల 20.6.2008 తేది నాటికి పది సంవత్సరాలు నిండుతాయి. అయినా ప్రతి నిత్యం మీరు మా స్మృతిపథంలో మెదలుతూనే వున్నారు. మా ప్రతి పనిలో వెన్నుతట్టి ప్రోత్సహిస్తూనే వున్నారు. మీ ఆదర్శాల బాటలో మా ప్రగతికి బాటలు వేసుకొని పయనిస్తున్నాం. సర్వాంతర్యామి ఆ భగవంతుడు మీ పవిత్రాత్మకు శాంతిని, మీ కుటుంబానికి మనశ్శాంతిని, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ...

సదా మీ సంస్మరణలో

కే.శే. డా॥కేతిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, (మేనల్లుడు)

కుమారులు

కేతిరెడ్డి వసీయర్‌రెడ్డి, B.E., (U.S.A.)

డాక్టర్ కేతిరెడ్డి రామ్‌బాయి, M.D.,

కేతిరెడ్డి రామకోటారెడ్డి, (మేనల్లుడు)

కేతిరెడ్డి ఉషారాణి

డాక్టర్ కేతిరెడ్డి కళాధర్, M.S. (Surgery)

కేతిరెడ్డి శశిధర్, B.E., (Computers), M.B.A.

చెక్క బొమ్మల తయారీలో చేయి తిరిగిన చైనా కళాకారులు





చైనా ఐటమ్స్ ఇటీవల ఎక్కడ చూసినా చైనా నామస్మరణే. చైనా దేశం గురించి చిన్ననాటి నుంచి పలు విషయాలు తెలుసుకొని వుంటాం. అక్కడి సంస్కృతి, సాంప్రదాయాలు, ప్రజల ఆహార అలవాట్లు, జీవనశైలి ఇలా పలు అంశాల గురించి ఏదో ఒక సందర్భంలో, ఏదో ఒక సమయంలో తెలుసుకొంటూనే వుంటారు ప్రతి ఒక్కరూ. ఇటీవల కాలంలో చైనా వస్తువులు దేశంలోకి అధిక సంఖ్యలో దిగుమతి అవుతున్నాయి. మొదట్లో ఎలక్ట్రానిక్ వస్తువులు మాత్రమే మనదేశంలో అందుబాటులో వుండేవి. చైనా ఎలక్ట్రానిక్ వస్తువుల పట్ల ప్రజల్లో భలే మోజు వుండేది. తర్వాత తర్వాత అన్నిరకాల వస్తువులు మన దేశంలోకి దిగుమతి అయ్యాయి. ఎక్కడ చూసినా, ఏది చూసినా అది చైనాలో తయారైన వస్తువో, వరికరమో అయి వుండటం నిత్యం మనకు కన్పిస్తున్నాయి. సెల్‌ఫోన్ రంగంలోనూ చైనా సెల్‌ఫోన్‌లు మిగతా ప్రముఖ కంపెనీలతో సరిసమానంగా అమ్మకాల్లో పోటీ పడటం, యువతను ఆకట్టుకొనే మోడల్స్‌లో రూపుదిద్దుకోవడం తెలిసిందే. ఈ పరిస్థితులలో పిల్లల కోసం తయారుచేసిన చైనా కొయ్య బొమ్మలు విశేషంగా ఆకట్టుకొంటున్నాయి. చైనాలో దొరికే కలపను ఉపయోగించి రూపొందించిన ఈ బొమ్మలు పిల్లలతోపాటు, పెద్దలను ఆకర్షిస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. చిన్నారులకు చదువుకు అవసరమైన నెంబర్లు గుర్తించడం, లెక్కించడం కోసం ప్రత్యేకంగా నెంబర్ల బోర్డును తయారుచేసి వున్నారు. దీనికే సమయాన్ని తెలుసుకోవడం కోసం గడియారాన్ని అమర్చి వున్నారు. దీనిని సాధారణ బోర్డులా కాకుండా పిల్లలను ఆకట్టుకొనేందుకు గాను రైలు బండి, బస్సు తదితర రూపాలలో తయారుచేసి వుండడం విశేషం. వీటితో మొసలి, పాముల బొమ్మలు చైనా ఉడ్‌ను ఉపయోగించి తయారు చేయడం అక్కడి కళాకారుల కళాభిరుచిని, వారి నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. బైక్‌లు, స్కూటర్లు, చిన్న పిల్లలు ఆడుకొనే ధమరుకం తదితర వస్తువులు, ఆశ్చర్యచకితుల్ని చేసే బొమ్మల్లో అగ్గిపెట్టెలో దాచి వుంచే బొమ్మల వస్తువులు వేటికవే అందరి దృష్టిని ఆకర్షించేలా వున్నాయి. అరవై రూపాయల నుంచి నాలుగు వందల రూపాయల ధరల్లో లభించే చైనా ఉడ్ బిటిమ్స్ పిల్లల్ని ఆకట్టుకొంటున్నాయడంలో ఎలాంటి సందేహం లేదు. ఇళ్లలోనూ షోకేస్‌ల్లోనూ వుంచుకొనేందుకు ఇవి బాగుంటుండడంతో వీటిని కొనే వారి సంఖ్య ఎక్కువైందనే చెప్పాలి.

జైన్ సిల్వర్ ప్యాలెస్‌లో

'శ్రావణ మాసం సందడి'

శ్రావణమాసం వస్తున్నదంటేనే ఆడపిల్లల తల్లిదండ్రుల హడావిడి మొదలవుతుంది. తమ కుమార్తెలకు మంచి సంబంధం చూసి ఓ అయ్య చేతిలో పెట్టాలన్నది ప్రతి తల్లిదండ్రులు కోరుకొనే విషయం. ఆషాడమాసం తర్వాత వచ్చే ఈ శ్రావణంలో బాజా భజంత్రీలు, బంధుమిత్రుల రాకతో పెండ్లి కార్యక్రమాలు బ్రహ్మాండంగా జరుగుతాయి. అంగరంగ వైభవంగా పెళ్లి చేసేందుకు వధువు తల్లిదండ్రులు ఎంతటి భారాన్నైనా మోసి ఘనంగా వివాహాలు చేస్తుంటారు. పెళ్లి ముహూర్తాలు వచ్చాయంటేనే ముందుగా గుర్తుకు వచ్చేవి నగల షాపులు. తమ తాహతుకు తగినట్లుగా బంగారు ఆభరణాలను కొనుగోలు చేసేందుకు వచ్చే వారితో నగల అంగళ్లు కిటకిటలాడుతుంటాయి. ప్రత్యేకంగా నూతన వధూవరులకు బంగారు నగలను తయారు చేసి అందించడంలో పేరెన్నికగన్నది నెల్లూరు మండపాల వీధిలో గల జైన్ సిల్వర్ ప్యాలెస్. ఈ షాపు స్థాపించి యాభై సంవత్సరాలు పైగా గడుస్తున్నా ఆనాటి నుంచి నేటి వరకు ఖాతాదారులను గౌరవిస్తూ వారి అభిరుచులు, అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకొంటూ ఎప్పటికప్పుడు క్రొత్త మోడల్స్‌ను రూపొందిస్తూ నెల్లూరీయుల ఆదరాభిమానాలను అందుకొన్నది జైన్ సిల్వర్ ప్యాలెస్. ఖాతాదారులే తమ దేముళ్లని చెప్పుకొనే షాపు నిర్వాహకులు బంగారు ఆభరణాలను, వజ్రాభరణాలను మరింతగా విస్తృత శ్రేణిలో విభిన్న మోడల్స్‌ను అందించేందుకుగాను ఇటీవల ఆచారివీధిలో



జైన్ గోల్డ్ అండ్ డైమండ్ షాపీ పేరుతో అతి పెద్ద బంగారు, వజ్రాభరణాల షాపును నూతనంగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మండపాలవీధి, ఆచారి వీధిలోగల జైన్ సిల్వర్ ప్యాలెస్, జైన్ డైమండ్ అండ్ గోల్డ్ షాపీ రెండింటిలోనూ వచ్చే శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని వధూవరులకు, ముఖ్యంగా వధువుల కోసం ప్రత్యేకంగా వివాహ కలెక్షన్స్ పేరుతో జైన్ సిల్వర్ ప్యాలెస్‌లోని డిజైనర్లచే రూపుదిద్దుకున్న నగలు ఎన్నో రకాలు ఖాతాదారులను ఆశ్చర్యపరిచే రీతిలో కొలువుతీరి వున్నాయి. హారాలు, నెక్లెస్‌లు, పావటి బిళ్లలు, జడకుచ్చులు, వడ్డాణాలు, చేతి పట్టాలు, వంకీలు, ముక్కుపుడకలు, గాజులు ఇలా చెప్పుకొంటూ పోతే అటు బంగారు నగలు, ఇటు వజ్రాభరణాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందినవి, హాల్‌మార్క్ బంగారం సమస్తం జైన్‌లో దొరకనివంటూ వుండవంటే అతిశయోక్తి కాదు. శ్రావణమాసంలో పెళ్లిళ్లకు సిద్ధమవుతున్న వధూవరుల తల్లిదండ్రులు నాణ్యమైన, నమ్మకమైన బంగారు ఆభరణాల కోసం జైన్ సిల్వర్ ప్యాలెస్‌ను సందర్శించవలసిందే.




ఒరిస్సా శిల్పుల అద్భుత సృష్టి!



రాతిని ఇంతిని చేసిన రాముడి గురించి తెలిసిందే. అదే రాతిని ఉపయోగించి ఎన్నో గృహోపకరణ పరికరాలు, వస్తువులు తయారు చేయడం, వాటిని వాడుకోవటం అనేది అనాదిగా వస్తున్న అలవాటే. రుబ్బుడు పత్రం దగ్గర్నుంచి అనేకానేక వస్తువులు రాయితో చేసిన వాటిని వినియోగించడం అనేది నిన్న మొన్నటి వరకు ఎక్కువగానే వున్న మాట నిజం. ఇటీవల కాలంలో వాటి స్థానంలో గ్రైండర్లు, మిక్సీలు రావడంతో వీటి వాడకం తగ్గినా ఇప్పటికీ అధిక సంఖ్యాకులు, గ్రామీణ ప్రాంతాల్లోని వారు రాతితో తయారు చేసిన వస్తువులనే ఉపయోగించడం అనేది జరుగుతూ వుంది. అయితే దేశంలో నైపుణ్యం గల చిత్రకారులకు, కళాకారులకు కొదువే లేదు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి పలురకాల బొమ్మలను తయారు చేస్తుంటారు, చిత్రాలను రూపొందిస్తుంటారు. మన రాష్ట్రంలోనే ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఆ తర్వాత ఒరిస్సా కళాకారుల గురించి చెప్పుకోవాలి. ఇత్తడితో బొమ్మలు, తాటాకుపై చిత్రాలు గీయడం, కాగితాన్ని ఉపయోగించి బాక్సులను తయారుచేయడం ఒరిస్సా కళాకారుల ప్రతిభకు గీటురాయి. ఆ కళాకారుల చేతుల మీదుగా రూపుదిద్దుకొన్నవే రాతి బొమ్మలు. మామూలు రూపంలో వున్న రాయిని అనువుగా చేసుకొని దానిపై వివిధ దేవతల చిత్రాలు, ప్రకృతి అందాలు ఎంతో హృద్యంగా తీర్చిదిద్దినట్లుగా బొమ్మలను తయారు చేయడం నిజంగా అబ్బురపరిచే అంశమే. గృహాలంకరణ కాకుండా కార్యాలయాలు, కప్‌బోర్డుల్లో కొలువు తీర్చుకొనేందుకు ఈ రాతి బొమ్మలు ఎంతగానో ఉపకరిస్తాయి. చిన్న చిన్న రాళ్లపై మొదలు పెద్ద పెద్ద రాళ్ల వరకు వివిధ రూపాలలో ఈ రాతి బొమ్మలను రూపొందించి వున్నారు. ఒరిస్సా కళాకారులు ముప్పైఐదు రూపాయల నుంచి రెండు వందల యాభైరూపాయల వరకు దొరికే ఈ రాతి బొమ్మలు కళల పట్ల అభిమానం వుండే వారిని బాగా ఆకర్షిస్తున్నాయి.



దర్గా పేరిట దురాక్రమణ




ట్రంకురోడ్డు, బారకాస్, కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్.. కాదేదీ దురాక్రమణకు అనర్హమంటూ... నెల్లూరు డైకస్‌రోడ్డులోని చేపల మార్కెట్‌లో రాత్రికి రాత్రే దర్గా కట్టేసారు. ఇప్పటికే చేపల మార్కెట్‌లో

చేపల మార్కెట్‌లో గలీజు పని!

కాలుతీసి కాలు పెట్టను స్థలం లేదు. పాత మార్కెట్‌లో చేపలు, రొయ్యలు, మాంసం, ఎండు చేపలు, కూరగాయలు, కిరాణా, పాత గుడ్డల అంగళ్లు చాలా వున్నాయి. మాంసం అంగళ్ల మధ్య ఇరుకైన స్థలంలో దర్గా కట్టేస్తే మన కార్పొరేషన్ అధికారులు, పాలకులు చూస్తూ ఉండి పోయారు.

ఎవరో ఒక మార్కెట్ నాయకుని దురాలోచనతో ఈ దర్గా వెలసి వుంటుంది. వాస్తవానికి దర్గా పరమ పవిత్ర స్థలం. నెల్లూరు బారాషాహీద్ దర్గా మినహా రాష్ట్రంలో ఏ దర్గాలోనికి మహిళలను రానివ్వరు. బయటే నిలబడి పార్థనలు చేయాలి. దీనికన్నా ఇంకో ముఖ్యమైన సంగతి ఏమిటంటే దురాక్రమించి... చండాల ప్రదేశాల్లో మసీదు, దర్గా నిర్మాణం ఇస్లాం ప్రకారం విరుద్ధం. ఈ దర్గాను చూసి మరో దేవాలయం, చర్చి మార్కెట్‌లో కట్టకముందే కార్పొరేషన్ ఈ అక్రమ నిర్మాణాన్ని తొలగించడం ఉత్తమం. లేకుంటే దురాక్రమణదారులు రెచ్చిపోతారు.



మద్యం షాపుల కోసం పోటాపోటీ!

జిల్లాలో మద్యం షాపులు చేజిక్కించుకోను ఏటికేటికీ పోటీ ఎక్కువవుతుంది. ఈ ఏడాది రియల్ ఎస్టేట్ వ్యాపారులు బ్రాందీ షాపుల దక్కించుకోను టెండర్లు దాఖలు చేయడంతో ఎక్కడలేని ఉత్కంఠత నెలకొనింది. జిల్లాలోని 348 మద్యం షాపులకుగాను రెండువేల మంది టెండర్లు దాఖలు చేశారు. గతంలో పది లక్షల రూపాయలకు పాడుకొన్న షాపులకు ఈసారి యాభై నుంచి అరవై ఐదు లక్షల రూపాయల వరకు పాడుకొనేందుకు సిద్ధమయ్యారు. నెల్లూరు నగరంలో ఈ పాట కోటి 21 లక్షల వరకు వెళ్లింది. గత ఏడాది టెండర్ దరఖాస్తుల ఫీజుగా ప్రభుత్వానికి 70 లక్షల రూపాయలు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఈ మొత్తం కోటి యాభై లక్షల రూపాయలయ్యింది. 346 షాపులకు గాను గత

రికార్డు స్థాయిలో బ్రాందీ షాపుల పాట

ఏడాది 100 కోట్ల రూపాయలు లాభంరాగా ఈ యేడాది 150 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చింది. ఈసారి జాతీయ రహదారుల ప్రక్కన వుండే బ్రాందీ షాపులకు పోటీ బాగా పెరిగింది. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు దాఖలు చేశారు. గతంలో జిల్లాలో 346 మద్యం షాపులుండేవి. ఈసారి మరో రెండింటిని పెంచారు. గత ఏడాది కంటే ఈసారి ప్రతి మద్యం షాపుపై 15 శాతం రేటు పెంచినా టెండర్లు పోటాపోటీగా పడ్డాయి. మొత్తం మీద 330 షాపులకు మాత్రమే పాట జరిగింది. నారాయణరెడ్డిపేటలో మద్యం షాపును రెండు కోట్లకు పాడుకొన్నారంటే ఈ పాటలు ఎంత వాడివేడిగా జరిగాయో

కొరవ 14వ పేజీలో



బతుకు పోరులో అలసిన బాల్యం

చేసేందుకే చట్టాలు... ఆచరణకు నోచుకోవనేదానికి నిలువుటద్దమే పై ఫోటోలోని దృశ్యాలు. జిల్లా అధికారులు నెల్లూరు విఆర్‌సి గ్రౌండ్‌లో 'బడి బాట' కార్యక్రమాన్ని ప్రచారార్భాటం మధ్య ప్రారంభించారేగానీ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను నామ్‌కే వాస్తే

ప్రభుత్వ పథకాలు నామ్‌కే వాస్తే...

చర్యంతోనే సరిపెడుతున్నారు. నిత్యం జిల్లా అధికార యంత్రాంగం, సీతలు పయసించే ట్రంకురోడ్డు, బారకాసు, ఆత్మకూరు బస్టాండు, మద్రాసు బస్టాండ్ ప్రాంతాల్లోని పలు దుకాణాలు, వ్యాపార సంస్థలలో లక్షలేనంత మంది బాల కార్మికులు పని చేస్తున్నారు. కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఈ ఫోటోలో కనిపిస్తున్న బాలలు బతుకు బండిని లాగను తమ భుజాలపై గోతాలు వేసుకొని వ్యర్థపదార్థాలను సేకరించి అమ్ముకొని తమ ఆకలి తీర్చుకుంటున్నారు. వీరికి బస్‌షెల్టర్లు, రైల్వే ప్లాట్‌ఫామ్‌లు రాత్రిళ్లు ఆశ్రయమిస్తున్నాయి. చదువు మానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్చను పదుల సంఖ్యలో పథకాలు, కోట్లాది రూపాయలను ప్రభుత్వం విడుదల చేస్తున్నా వీటిని సద్వినియోగంచేసే చిత్తశుద్ధి గల అధికారులు, రాజకీయ నాయకులు లేరు. అదే బాధాకరం. దీనివల్లే ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా ఫలితముండడం లేదు.


బంగ్లాదేశీయుని అరెస్ట్!

బంగ్లాదేశ్‌కు చెందిన రబ్బీవుల్ ఇస్లాం అనే యువకుడ్ని 13వ తేదీ నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు బంగ్లాదేశీయులకోసం పోలీసులు గాలిస్తున్నారు. రబ్బీవుల్ ఇస్లాం 14వ ఏట అరబ్బీ చదువుకొనేందుకు ఉత్తరప్రదేశ్‌లోని ఓ మదరసాకు వచ్చాడు. అప్పుడప్పుడు సరిహద్దు దాటి ఇంటికి వెళ్తుండేవాడు. ఆరేళ్ల క్రిందట రబ్బీవుల్ ఇస్లాం, యుపి నుంచి నెల్లూరుకు ఇస్లామిక్ జమాత్ బృంద సభ్యునిగా వచ్చాడు. చక్కగా ఖురాన్ పరిస్తుండడంతో బుచ్చిరెడ్డిపాళెం మండలం నాగమాంబపురం గ్రామస్తులు తమ మసీదులో ఇమాంగా పెట్టుకొన్నారు. ఈ మధ్య బంగ్లాదేశ్‌కు వెళ్లి పెళ్లి చేసుకొని వచ్చాడు. ఇస్లాం భార్య తమది బంగ్లాదేశ్ అనడంతో స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగి అతడ్ని అరెస్ట్ చేయడం జరిగింది. ఎస్పీ మల్లారెడ్డి ఇతనిపై పాస్ పోర్టు యాక్ట్ క్రింద కేసు నమోదు చేయడంతో జైలుకు వెళ్లాడు. శిక్ష అనంతరం ఇతన్ని భారత ప్రభుత్వం బంగ్లాదేశ్ పంపాలి. ఇన్నాళ్లు చాకచక్యంగా నాగమాంబపురంలో వుంటూ బంగ్లాదేశ్‌కు నెల్లూరు నుంచి బుచ్చికి వెళ్లి వచ్చినట్లు వెళ్లి వస్తుండిన రబ్బీవుల్ ఇస్లాంకు మళ్లీ ఇండియా రావడం పెద్ద కష్టం కాదు. ఈ ఉదం

కొరవ 14వ పేజీలో

కామెర్లతో సతమతమవుతున్న జనం

కలుషిత నీరే కారణమంటున్న డాక్టర్లు



నెల్లూరు నగరంలోని ప్రజలను కామెర్లు బాధిస్తున్నాయి. ఏ ప్రాంతానికి వెళ్లినా కామెర్ల వ్యాధి బారిన పడిన వారు కన్పిస్తున్నారు. కలుషిత నీటిని త్రాగడం వల్లనే అధిక సంఖ్యలో ఈ వ్యాధిగ్రస్తులవుతున్నారు. ఎక్కడ చూసినా పగిలిన నీటి పైపులైన్లు, పైపుల గుండా మురికినీరు కలిసి నగర ప్రజలను వ్యాధిగ్రస్తులను చేస్తున్నాయి. మొన్న గున్యా, నిన్న డెంగ్యూ బారిన పడిన నగర వాసులను నేడు కామెర్లు వేధిస్తున్నాయి. గత నెల రోజులుగా ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా వుంది. ఏ ఆస్పత్రిని పరిశీలించినా కామెర్లతో బాధపడే వారే కన్పడుతున్నారు. రోజుకు వందల కేసులు నమోదవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా రోజుకు ఐదు వందలకు పైగా కామెర్ల రోగులను గుర్తించి సమాచారం. రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల, జయభారత్ హాస్పిటల్, నెల్లూరు హాస్పిటల్‌తోపాటు నగరంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు కామెర్ల వ్యాధిగ్రస్తులతో కిటకిటలాడుతున్నాయి. నన్న జనం వరిస్థితి అయితే అంతంత మాత్రంగా వుంది. కుటుంబభారం మోసే వ్యక్తి జబ్బున పడడంతో ఆ కుటుంబం కడుపు నింపు కోవడం కోసం నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. రామ్‌నగర్ ప్రాంతంలో వలస కూలీలు వుండేచోట 90శాతం మందికి కామెర్లు సోకి వున్నాయి. సంతపేట, పప్పులవీధి, ఉస్మాన్‌సాహెబ్‌పేట, నవాబుపేట, చీపురకట్ట సంఘం, బాలాజీ

కొరవ 14వ పేజీలో

వారఫలాలు

తేది 21-6-2008 నుంచి 27-6-2008 వరకు మిథునంలో రవి, శుక్రులు; వృషభంలో బుధుడు; సింహంలో కుజ, శనులు; ధనస్సులో గురువు; కుంభంలో రాహువు; కర్కాటంలో కేతువు; మకర, కుంభ, మీనాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

శుభ ముహూర్తాలు లేవు.

21వ తేదీ ఆరుద్ర కార్తె ప్రారంభం.

జూన్ తిథులు
జేష్ఠ బహుళ

21	శని	తదియ	తె.4.26 గం.ల.వ
22	ఆది	చవితి	తె.5.38 గం.ల.వ
23	సోమ	పంచమి	పూర్తి
24	మంగళ	పంచమి	ఉ.6.20 గం.ల.వ
25	బుధ	షష్ఠి	ఉ.6.28 గం.ల.వ
26	గురు	సప్తమి	ఉ.5.59 గం.ల.వ
		అష్టమి	తె.4.49 గం.ల.వ
27	శుక్ర	నవమి	తె.3.00 గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి,
16/1020, పొగతోట, నెల్లూరు - 1.
E-mail:maripmgg@yahoo.com



మేషం
(అశ్విని, భరణి, కృత్తిక 1 పాదం)

అత్మవిశ్వాసం పెరుగుతుంది. కోర్టు వ్యవహారాల్లో మీ వైపు ముందంజ ఉంటుంది. సంతానంతో అభిప్రాయభేదాలు రావచ్చు. మహాత్ములను సందర్శిస్తారు. నిల్వల నుంచి ఖర్చు చేయవలసిన పరిస్థితి తొలగుతుంది. శ్రమకు తగ్గ ఫలం ఉంటుంది. వ్యాపారులు నూతన ప్రయత్నాలు చేస్తారు. తోటివారి పనితీరు చిరాకును కల్గిస్తుంది. భాగస్వాములు లాభార్జన చేస్తారు. కళాకారులు, వృత్తిపరులు ఉత్సాహంగా కానవస్తారు.



వృషభం
(కృత్తిక 2,3,4 పా., రోహిణి, మృగశీర్ష 1,2 పా.)

సంతానం పురోభివృద్ధి ఆత్మానందానిస్తుంది. కోపావేశాలు తగ్గుముఖం పడతాయి. విందులు వినోదాల్లో పాల్గొంటారు. సోదరుల తోడ్పాటు సాయం అందుతుంది. విదేశాగమన అవకాశాలు లభిస్తాయి. ఉత్సాహంతో పనులు చక్కగా సాగిస్తారు. తల్లి అనారోగ్య సూచన. విరోధులపై మీదే పైచేయి. వ్యాపారం ప్రోత్సాహకరంగా కానవస్తుంది. రానీ బాకీలు వసూలవుతాయి. రాజకీయులు ఇతరుల్ని విమర్శించవద్దు.



మిథునం
(మృగశిర 3,4 పా., ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పా.)

ప్రశాంతంగా పలకరించడం అలవాటు చేసుకోవాలి. విలువైన వస్తువుల్ని కొంటారు. సంతానానికి ఉద్యోగ ప్రాప్తి అవకాశాలు. మిత్రుల మూలంగా ఆదాయ ప్రాప్తి. ఆరోగ్యం చక్కగా వుంటుంది. ప్రభుత్వ సంబంధిత పనులు చక్కబడతాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. రాజకీయులకు పైవారి ఆదరం బాగా వుంటుంది. కోర్టు వ్యవహారాలు చక్కబడతాయి. వ్యాపారులు ముందంజ వేస్తారు.



కర్కాటకం
(పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేషలు)

భార్యాభర్తల మధ్య గొడవలు, సమస్యలు తొలగిపోతాయి. ఆరోగ్య విషయం కొంత మెరుగవుతుంది. అద్ధంపడిన పనులు చక్కగా సాగుతాయి. సంతానం చదువు, వివాహం అనుకొన్న రీతిలో జరుగుతాయి. తల్లి ఆరోగ్యం కుదుట పడుతుంది. వత్తిడి, అలసట కొద్దిగా వుండవచ్చు. ఋణ బాధలు తీరుతాయి. సంఘంలో ప్రముఖుల పరిచయం ఫలవంతమవుతుంది. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం.



సింహం
(మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం)

సంతాన మూలక సుఖప్రాప్తి. కన్నెపిల్లలకు కళ్యాణ ఘడియలువచ్చినట్లే. ప్రమాదావకాశాలున్నాయి జాగ్రత్త. నిరుద్యోగులకు, ఉద్యోగులకు విదేశ సంబంధాలతో ఉద్యోగ ప్రాప్తి. ప్రభుత్వ సంబంధిత పనుల్లో అడ్డంకులు తొలగిపోతాయి. రాజకీయులు ఉత్సాహంగా కానవస్తారు. గృహాలంకరణ పనుల్లో లీనమవుతారు. వ్యాపారంలో నూతనపంథా అనుసరించి లాభార్జన చేస్తారు.



కన్య
(ఉత్తర 2,3,4 పా., హస్త, చిత్త 1,2 పా.)

భార్యాభర్తల మధ్య చిన్న చిన్న సమస్యలు రావచ్చు. సంతాన మూలంగా సమస్యలుంటాయి. వత్తిడి, ఖర్చులు అధికం. బంధు మిత్రుల మధ్య ఉత్సాహంగా పాలుపంచుకొంటారు. కన్నెపిల్లలకు ఆందోళన తగ్గుతుంది. వైద్యపరంగా ఖర్చులుంటాయి. ఇబ్బందులుండినా ప్రభుత్వ సంబంధిత కార్యకలాపాలు జరుగుతాయి. భవిష్యత్తుకు ప్రణాళికలు చక్కగా ఏర్పాటు చేస్తారు. వ్యాపారులకు ఆర్థిక లావాదేవీలు చక్కగా వుంటాయి.



తుల
(చిత్త 3,4పా., స్వాతి, విశాఖ1,2,3 పా.)

ఎదురుచూసిన డబ్బు చేతికందుతుంది. కుటుంబ సభ్యులతో కలసి మెలసి ఆలోచనలు పంచుకొంటారు. భార్యాభర్తల సంబంధం చక్కగా వుంటుంది. సంతానానికి సంబంధించిన భవిష్యత్తుకై పథకాలు వేస్తారు. తల్లికి అనారోగ్య బాధలుంటాయి. ప్రేమ వ్యవహారాలు సఫలమవుతాయి. రాజకీయులు పొత్తాహంతో కానవస్తారు. స్తబ్ధుగా ఉండిన వ్యాపారం ఊపందు కొంటుంది. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది.



వృశ్చికం
(విశాఖ 4పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

వ్యాపారులకు చాలా మంచి కాలం. కొత్త ఒప్పందాలు చేసుకొంటారు. పోటీదారులు లొంగి వుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభకరంగా ముగుస్తాయి. బాధలు పెడ్తూ వచ్చిన అధికారి మనసు మారి ప్రోత్సాహపరచడం వల్ల ఉద్యోగులకు ఊరట ఏర్పడుతుంది. చేతిలో డబ్బు చక్కగా ఆడుతుంది. అనారోగ్య పరిస్థితులు కుదుటపడతాయి. మనోధైర్యం పెరుగుతుంది. వారసత్వపు ఆస్తుల్లో మార్పులు తెస్తారు. విద్యార్థులకు శుభోదయం.



ధనుస్సు
(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

సంతానం వివాహయోగ్యకాలమిదివ. సోదరులు మీ హృదయాల్ని చక్కగా అర్థం చేసుకొంటారు. విరోధ భావాలు తొలగిపోతాయి. భార్యాభర్తల మధ్య అన్యోన్యత పెరుగుతుంది. దూరప్రయాణాలు లాభిస్తాయి. కన్నెపిల్లలకు అడ్డుపడి ఆగిపోయిన వివాహాది శుభకార్యాలు నిశ్చయింపబడతాయి. ఆకస్మిక ప్రయాణావకాశాలు. ఆభరణాలు కొంటారు. వ్యాపారులకు లావాదేవీలు చక్కగా వుండి వ్యాపారాభివృద్ధి జరుగుతుంది.



మకరం
(ఉత్తరాషాఢ 2,3,4 పా., శ్రవణం, ధనిష్ఠ 1,2 పా.)

ఋణ విమోచన వుంటుంది. అలసట, అనారోగ్య బాధలధికం. అనవసరంగా పగ, ద్వేషం పెరుగుతుంది. భార్యాభర్తల సంబంధం కొంత మెరుగుపడుతుంది. వాహనయోగ ప్రాప్తి. ఆగిపోయిన పనుల్ని నేర్పుగా పూర్తి చేస్తారు. సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి. వ్యాపారులు హఠాత్తుగా మార్పులు తెచ్చి వ్యాపారాభివృద్ధి చేస్తారు. కొనుగోలుదారుల సంఖ్య పెరుగుతుంది. భాగస్వామ్యం చక్కగా కలసి వస్తుంది.



కుంభం
(ధనిష్ఠ 3,4 పా., శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పా.)

సంతానం గురించి చక్కగా ఆలోచించి వారి భవిష్యత్తుకై యోచన చేస్తారు. సంతానం కోసం పరితపించే వారు శుభవార్త వింటారు. భార్యాభర్తల సంబంధం చక్కగా వుంటుంది. సోదరుల తోడ్పాటు ఉంటుంది. నూతన వాహన ప్రాప్తి. సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి. కోర్టుకేసుల్లో మంచి దారి ఏర్పడుతుంది. ఇంటిలో శుభకార్యాచరణ చేస్తారు. వ్యాపారంలో ఏకాగ్రత పెరుగుతుంది. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు లభిస్తాయి.



మీనం
(పూర్వాభాద్ర 4 పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

శారీరక ఆరోగ్యం మేలుగా వుంటుంది. సోదరుల మూలంగా లాభాలుంటాయి. దూరప్రయాణాలు లాభకరంగా ముగుస్తాయి. సంతానం కోరిక నెరవేర్చడానికి ప్రయత్నాలు చేస్తారు. ప్రేమ వ్యవహారాలు సుముఖంగా చక్కబడతాయి. ఇతరులతో నిదానంగా మాట్లాడాలి. ఆస్తి గొడవలు చక్కదిద్దుకొంటారు. వాహనం కొనే అవకాశాలున్నాయి. రాజకీయులకు మేలైన కాలం. ఉద్యోగంలో వృద్ధి కానవస్తుంది.

ఈశాన్యం అనేక కోణాలు!

ఐ.లక్ష్మీకాంతమ్మ గుంటూరు

* ప్రహరీ, ఇల్లు ఈశాన్యం వైపు తిరిగాయి. శుభాలు శూన్యం. ఈ బాధలు శత్రువులకు కూడా కలుగకూడదు.

సుదీర్ఘమైన మీ లేఖ అందింది. ఈశాన్యం ప్రహరీ అంగుళాల్లో పెరగాలి. ఇల్లు ఈశాన్యం తిరుగరాదు. ఈశాన్యం అడుగుల్లో పెరిగితే దారిద్ర్యం. 'కోణవేధ' మీకు 'శాపోహ' స్థితిని కలిగించింది.

టి.రంగనాయకి చెన్నై

* ప్లాటుకు ఈశాన్యం అంగడి మా అక్కగారికి, స్థలం మాకూ చెందాయి. అబ్బాయి తప్పిపోయాడు.

ఈశాన్యం తెగిన ప్లాటు కొనరాదు. గృహ నిర్మాణం చేయరాదు. తూర్పు మగ పిల్లలపై విపరీతమైన ప్రభావాన్ని చూపిస్తుంది.

యు.సుందరమ్మ నాయుడుపేట

* తూర్పు, ఉత్తరాల మధ్య బాత్రూం తొలగించాక మా వారి ఆరోగ్యం కుదుట పడింది. తూర్పు షెడ్డు తీశాక పిల్లవాడు బుద్ధిమంతుడయ్యాడు.

ఈశాన్యం బాత్రూం, హద్దుపై షెడ్డు తొలగించాక ఈ పరిణామాలు జరుగుతాయని శాస్త్రం ముందే చెప్పింది. కృతజ్ఞతలతో నా దగ్గరకు రావడం కన్నా కాళహస్తీశ్వర సందర్శనం చేసుకోండి.

ఎ.అరుణకుమారి ఏలూరు

* ఈశాన్యంలో గుడి నిర్మాణం జరిగితే మా అప్పుల బాధలు తీరుతాయన్నారు. వినాయకుడి గుడి నిర్మించాము.

ఎంత విశాలమైన ప్రాంతమైనప్పటికీ ఈశాన్యంలో గుడి నిర్మాణం నిషిద్ధం. ఈశాన్యం బరువై, తెంపయి, ఓడలు బండ్లవుతాయి.

వాస్తు సందేహాలు-సమాధానాలు
ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
ఫోన్ : 2322345
సెల్: 94901 25878
4వ వీధి, గాయత్రినగర్
ఎ.కె.నగర్ పోస్ట్, నెల్లూరు - 4.

టి.శాంతకుమారి నెల్లూరు

* ఈశాన్యంలో మామిడి చెట్టు కొట్టేశాక ఆయన ఎటో వెళ్లిపోయారు. అమ్మాయి పుట్టింటికి వచ్చేసింది.

అది తూర్పు ఉచ్ఛానికి 12 అడుగుల దూరం ఈశాన్యం కాదు. ఫలించే వృక్షాన్ని కొట్టడం వల్ల మీ యింట్లో ఈ ఫలితాలు జరిగాయి. తొందరపాటు చర్యల వల్ల కుటుంబమే నష్టపోతుంది.

ఎస్.శ్రీరామశర్మ శ్రీకాళహస్తి

* తూర్పు వైపు చివర సెప్టిక్ ట్యాంక్ నిర్మించాము. ఆర్థికం, ఆరోగ్యం బాగోలేదు.

అది ఈశాన్య భాగం అవుతుంది. అంగవైకల్యం, ఇబ్బందికర పరిస్థితులు ఖాయం అన్నాయి శాస్త్రాలు.

ఆర్.శ్రీపతిరావు హైదరాబాద్

* ఈశాన్యంలో 'సెల్లార్'పై బండలు వరచి నడుస్తున్నాము.

అలా నడువకూడదు. ఈశాన్యంలో బోరు, బావి తప్ప ఇతరత్రా ఏవీ రాకూడదు. అందులో సింహద్వారానికి ఎదురు 'గుంతలు' రావడం తప్పు.

వి.శ్రీధరరెడ్డి తడ

* దేవుణ్ని ఈశాన్యం గదిలో కదా పెట్టాలి.

ఈశాన్యపు గదిలో ఈశాన్యం, లేదా తూర్పు చూసేలా పెట్టాలి. పశ్చిమ దిశ చూడకూడదు. ఆ యిల్లు కలిసి రాదు.

సి.హెచ్.గీతాంజలి గూడూరు

* తూర్పు, ఉత్తరాల మధ్య డ్రైనేజీ కాలువ రావచ్చా? మనం ఈశాన్యం వైపు మూత్ర విసర్జన చేయవచ్చా?

ఈశాన్యం డ్రైనేజీ కాలువ రావచ్చు. గంగా ప్రవాహానికి తారతమ్యాలు కానీ, దోషాలు కానీ అంటవు. ఈశాన్యం పిట్ వైపు మూత్ర విసర్జన నిషిద్ధం.

శ్రీవిష్ణురెడ్డి ఆత్మకూరు

* తూర్పు ఉత్తరాల వైపు ప్రహరీ, ఇల్లు తిరిగాయి. మా నాన్న గారి హయాం వరకూ బాగానే జరిగింది.

అధికస్య అధిక ఫలం. శుక్ర స్థితి వున్న మీ నాన్న గారికి బాగానే అమరింది. మీకు ఆ స్థితి లేక పోయే సరికి అవాస్తు మీపై దాడి చేసింది.

శ్రీకాంత్‌శర్మ నెల్లూరు

* తూర్పు దేవుడి పీఠిక వుంది. పశ్చిమం చూస్తున్నాడు.

తూర్పు మండపం నిర్మాణం చేసి దేవుణ్ని పశ్చిమం చూపిస్తే ఈశాన్యం భ్రష్ట మవుతుంది. సూర్యాస్తమయాన్ని దేవతలు చూడటం ఇంటికి అరిష్టం.

కవిత

"పచ్చదనం"

వృక్షాల సొంతం పచ్చదనం
పచ్చదనం సృష్టికి అందం
జంతు జీవనానికి ఆలంబనం
మానవ జాతికి మూలాధారం.

వృక్షాల స్థావరంలో ఇంటి స్థలాలు
వ్యవసాయానికి సేద్యపు భూములు
ఎక్కువయినాయి కరవు కాటకాలు
ఎండల తీవ్రత, భూకంపాలు
వర్షాల కోసం ఎదురుచూపులు
వాతావరణంలో విషవాయువులు
అధికమవుతున్నారు వ్యాధిగ్రస్తులు.

చెట్లగాలి ఆస్తమా రోగులకు దివ్యౌషధం
వృక్షాలను పెంచడం మన తక్షణ కర్తవ్యం
వాయు కాలుష్యాన్ని అరికట్టి స్వచ్ఛమైన గాలిని శ్వాసిద్దాం
పచ్చదనాన్ని అందిద్దాం - సృష్టికి అందం మళ్లీ తెద్దాం.

- **లిప్సావరపుల సుబ్రహ్మణ్యం**, ఇందుకూరుపేట.


సంఘ బంధాల అవినీతిలో బంది ఉపాధిహామి!

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలకు ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా సంవత్సరానికి 100 రోజులు కూలీ పనులు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఉపాధిహామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులు సమకూర్చుతున్నాయి.

ఈ పథకం అమలు కోసం నిబంధనలు కఠినతరం చేసినా ఏదో ఒక మండలంలో అవినీతి, అక్రమాలు జరుగుతూనే వున్నాయి.

జిల్లాస్థాయిలో నీటి యాజమాన్య సంస్థ, మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రామస్థాయిలో పంచాయితీ కార్యదర్శి, సంఘ బంధ సభ్యులు ఉపాధిహామీ పథకంలో సభ్యులుగా వుంటున్నారు. ఇంత మంది సభ్యులుగా వుంటున్నా కూడా అవినీతి, అక్రమాలు యధావిధిగా నిరాటంకంగా కొనసాగుతున్నాయంటే ఆశ్చర్యపోక తప్పదు. జిల్లాలోని 46 మండలాల్లో 961 గ్రామ పంచాయితీలకుగానూ 957 పంచాయితీలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథం అమలు జరుగుతున్నది. గ్రామస్థాయిలో పనులు చేసిన కూలీలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి నగదు మంజూరు చేస్తారు.

ఎంపిడిఓ మంజూరు చేసిన నిధుల్ని సంఘబంధాల సభ్యులు కూలీలకు పంపిణీ చేయడం జరుగుతుంది. ఇంతవరకు బాగానే వున్నా ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక సిబ్బంది అధిక



శాతం అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. తక్కువ మంది కూలీల చేత పనులు చేయించి ఎక్కువమంది కూలీలు పని చేసినట్లు రికార్డులలో నమోదుచేసి మిగిలిన కూలీ డబ్బును స్వాహా చేసేస్తున్నారు. ఇప్పటివరకు ఇందుకు బాధ్యులైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. 2007-08 సంవత్సరంలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 3,62,489 కుటుంబాలకు 3,76,568 జాబ్ కార్డులు జారీ చేయడం జరిగింది. 26,881 పనులకు 28125.13 లక్షలు ఆదాయం లభించగా వీటిలో 15373. 70 లక్షల వ్యయంతో 13,555 పనులు జరుగుతున్నాయి.

ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి వరకు 111 కోట్ల 83 లక్షల 19వేల రూపాయలు నిధులు విడుదల చేశాయి. వీటిలో 68 కోట్ల 92 లక్షల 48 వేల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది. ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు బ్యాంకు, పోస్టాఫీసులలో ఖాతా ప్రారంభించి అందులో నగదు జమ చేయాలన్న నిబంధన వుంది. అయితే ఇది ఎక్కడా సక్రమంగా అమలు జరగడం లేదు. గ్రామస్థాయిలో సంఘబంధ సభ్యులకు తెలియకుండానే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

లక్షల రూపాయల నిధులు దుర్వినియోగం జరగడంతో ఈ పథకం ఉద్దేశ్యం పూర్తిగా దెబ్బతిని పోతుంది. మరణించిన వారి పేర్లతో జాబ్ కార్డులు తయారు చేయడం, వారి పేర్లతో నగదు తీసుకోవడం వంటి అక్రమాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. ఇటీవల కొండాపురం మండలంలో ఈ పథకంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపిన అధికారులు అక్కడి రికార్డులు పరిశీలించి అవాక్కయ్యారు. బాలాయపల్లి, దక్కిలి మండలాల్లో మరణించిన వారికి కూలీ డబ్బు చెల్లించినట్లు నిర్ధారణ జరిగింది. పై సంఘటనలు కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇటువంటివి జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీలలో జరుగుతూనే వున్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంపై జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా వెళ్ళాయి. దీనిపై పూర్తి విచారణ జరపాలని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు కూడా అందాయి. ఇటీవల అవినీతి నిరోధకశాఖ

తొరవ 14వ పేజీలో

సినిమా సమీక్ష
అల్లూరు రహీం

కమల్‌హాసన్ నట విశ్వరూపం - దశావతారం!

భారతీయ వెండితెరపై ఇప్పటి వరకు ఒకే చిత్రంలో తొమ్మిది పాత్రలు పోషించిన నటులుగా అక్కినేని నాగేశ్వర రావు, శివాజీ గణేషన్, సంజీవ్‌కుమార్ పేరిట అరుదైన రికార్డు నమోదై వుంది. దీన్ని దశాబ్దాల తర్వాత బ్రేక్ చేస్తూ పద్మశ్రీ కమల్‌హాసన్ కథ, కథనంతో పాటు పది పాత్రలు పోషించిన చిత్రం దశావతారం. కమల్‌హాసన్ వెండితెరపై లెక్కలేనన్ని విలక్షణ పాత్రలు పోషించిన జాతీయ ఉత్తమ నటుడు. దశావతారంలో ఆయన నట విశ్వరూపాన్ని ప్రదర్శించారనాలి. ఇరవై రీళ్ల ఈ సినిమాను ప్రేక్షకులు అబ్బురపడేట్లు చూసేలా పలు సన్నివేశాలున్నాయి. 12వ శతాబ్దంలో మొదలయ్యే ఈ చిత్రం 2006 వరకు కొనసాగుతుంది. దీనికి కార్యకారణ సంబంధాన్ని జత పరుస్తూ ప్రపంచంలో జరిగే సంఘటనలకు ఒకదానితో మరొకదానికి సంబంధముంటుందని కథకుడు చెబుతాడు. 12వ శతాబ్దంలో దక్షిణా పథంలో జరిగే శైవ - వైష్ణవ గొడవల్లో కులుత్తోంగ చోళుడు, శ్రీరంగనాథుడ్ని పెకల్చి సముద్రంలో వేయడం, దీన్ని అడ్డుకోను రంగరాజ నంబి పాత్రలో హీరో పోరాడే సన్నివేశాల చిత్రీకరణ బాగుంది. విజువల్ ఎఫెక్ట్స్ మూలంగా కమల్‌హాసన్ వీపుపై కొక్కీలు దింపి ప్రేలాడతీసే సన్నివేశం; శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి చెందిన అమెరికా బయోటెక్నాలజీ ల్యాబ్‌లోని సెక్యూరిటీ సన్నివేశాలు ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. సెల్‌ఫోన్ ఆధారంగా సిఐఏ



మాజీ ఏజెంట్ ఫ్లెచర్, శాస్త్రవేత్త గోవిందరాజులును వెంటాడడం, జపాన్ కరాటే ఫైట్లు, ఓహో సనమ్ పాటలో హీరో గాలిలో నడక, చిత్రం చివరన ప్రకృతి వైపరీత్యం 'సునామీ'ని వెండితెరపై చూసే ప్రేక్షకుడు ఎక్కడికో వెళ్లిపోతాడు. దశావతారంలో వైష్ణవ యువకుడు రంగరాజ నంబి, అమెరికన్ అధ్యక్షుడు జార్జిబుష్, బామ్మ కృష్ణవేణి, జపాన్ కరాటే మాస్టర్, పంజాబీ గాయకుడు అవతార్ సింగ్, దళిత యువకుడు పుణ్యకోటి, పొడుగు ముస్లిం యువకుడు సమీవుల్లా, బయో శాస్త్రవేత్త గోవింద రాజులు, సిబిఐ అధికారి బలరాం నాడర్, సిఐఏ మాజీ ఏజెంట్ ఫ్లెచర్ పాత్రలను కమల్ హాసన్ పోషించాడు. రంగరాజ నంబి, బామ్మ కృష్ణవేణి, గాయకుడు అవతార్ సింగ్, శాస్త్రవేత్త గోవింద రాజులు, సిబిఐ అధికారి బలరాం నాడర్ పాత్రలు మాత్రమే కమల్ హాసన్ పోషించినట్లు మాములు ప్రేక్షకులు తెలుసుకోగలుగుతారు. మిగతా ఐదు పాత్రలకు చేసిన అద్భుత మేకప్ వల్ల కమల్‌హాసనేనా... కాదా అనే సందేహం కలిగేంత అద్భుతంగా పాత్ర పోషణ చేశారాయన.

దశావతారంలో అన్ని సన్నివేశాలు హాలీవుడ్ స్థాయిలో కుదరకపోయినా ఆ అనుభూతి కల్గను హాలీవుడ్ విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు బ్రియన్ జెన్నింగ్స్ బాగా కష్టపడ్డాడు.

ఈ చిత్ర మాటల రచయిత వెన్నెలకంటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ శాస్త్ర సాంకేతిక అంశాల మీద అవగాహన లేని వ్యక్తిగా చూపే ప్రయత్నంలో ఒక సన్నివేశంలో పలికించిన NAcl (సోడియం క్లోరైడ్) అంటే ఏమిటి? దాని మీద క్లస్టర్ బాంబులు వేయవచ్చా అని ప్రశ్నించడం నవ్వు తెప్పిస్తుంది. మరో చోట కాస్త అతికిపోయి ఓ డైలాగ్ పలికించాడు వెన్నెలకంటి. 12వ శతాబ్దం.... విసుక్రీస్తు... అల్లాలేని రోజుల్లో కథ ఇది అంటాడు బాక్ డ్రాప్‌లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. విసుక్రీస్తు, మహమ్మద్ ప్రవక్తలు క్రైస్తవ, ముస్లిం మతాల ప్రబోధకులు మాత్రమే. వీరిద్దరికి దైవ సందేశం అందే సమయానికి ఈ మతావలంబీకులకు అసలు దైవమే లేదని చెప్పను ఆధారాలు ఎవరైనా చూపగలరా వెన్నెలకంటి గారు...?

తొరవ 14వ పేజీలో



హాలీవుడ్‌కు సయాలీ!

పలుపురు ఉత్తరాది భామలు దక్షిణాది సినిమాల్లో నటించేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే మరో బాలీవుడ్ భామ తెలుగు తెరపై తళుక్కు మనబోతుంది. సాధారణంగా హీరోయిన్లు ఎదిగేందుకు ప్రయత్నిస్తారు, కానీ కొంతమంది ఉత్తరాది తారల్ని చూస్తుంటే ఒక మెట్టు దిగుతున్నారేమోననిపిస్తోంది. హల్లాబోల్, త్రీయిన్ వంటి బాలీవుడ్ సినిమాల్లో నటించిన సయాలీ భగత్ తెలుగులో నటిస్తుంటే, తాజాగా మరో బాలీవుడ్ హీరోయిన్ సోనాల్ చౌహాన్ కూడా తెలుగు సినిమా వైపు దృష్టి పెట్టింది. బాలీవుడ్‌లో జన్నత్ చిత్రంలో నటించిన సోనాల్ చౌహాన్ తాజాగా తెలుగులో ఓ వర్ధమాన నటుడి సరసన రొమాన్స్‌లో నటిస్తోంది. జాతీయస్థాయి సినిమా నుంచి ప్రాంతీయస్థాయి సినిమాకు దిగుమతి కావడం ఎదగడమో, మెట్టు దిగడమో మరి వీళ్లకే తెలియాలి.



చిత్రాలు చెడిపోయాయి!

రంగీలా ఫేం ఊర్మిళ శృంగారం, చిలిపితనం ఒలికించడంలో దిట్టని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఈ మధ్య ఆమెకు సినిమాలు తగ్గాయి. టీవీల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆమె పిచ్చాపాటీగా మాట్లాడింది. ఇప్పటిదాకా మీ ఇమేజ్‌ను ఎలా నిలబెట్టుకుంటూ వస్తున్నారంటే నన్ను నేను మరచి ఎప్పుడూ ప్రవర్తించను. నేను అందరికీ తెలిసానంటే ఆ క్రెడిట్ మా కుటుంబానిదే. దబ్బు, హోదా, ఇమేజ్ ఇవన్నీ నటుడికి అవసరమే. సినిమాల్లో స్త్రీ పాత్రలు ఎలా వున్నాయనుకొంటున్నారంటే స్త్రీ పాత్రలనే కాదు. మానవీయత అనేది మన చిత్రాల్లో కరవైంది. నిజానికి మనలో ఇప్పుడు రాముడు, సీతలాంటి వారున్నారా? రాముడు కంటే రావణులే ఎక్కువ. నటన వల్ల నా జీవితాన్నేమీ కోల్పోలేదు. మేం తిరిగే వాతావరణం అందాలు, హంగులు, ఆర్భాటాలతో వుంటుంది. కాబట్టి మాకు ఎఫైర్‌లు ఎక్కువనుకోవడం సహజం.

కామ్న జాతకం మారేనా?



కొందరు హీరోయిన్లను చూడగానే అందంగా కనపడతారు. డ్యాన్స్, నటన బాగానే చేస్తారు. ఎక్స్‌పోజింగ్‌తో అదరగొట్టేస్తారు. కానీ సక్సెస్ మాత్రం వీరిని వెక్కిరిస్తూనే వుంటుంది. అటువంటి కోవకు చెందిన హీరోయిన్ కామ్నా జఠ్మలానీ. బుల్లితెర మీద "ఫోడ్‌దో ఆచల్ జమాన" అనే పాటలో నర్తించిన కామ్న ప్రేమికులు చిత్రంతో తెలుగు తెరపై తళుక్కుమంది. హైట్, పర్సనాలిటీ బాగానే వుండడంతో 'రణం' సినిమా చేసినా సక్సెస్ రాలేదు. టాస్ చిత్రం కూడా బోల్తా పడడంతో తాజాగా



పెళ్లి కూతురైన 'గోపిక'

యువసేన, ఆటోగ్రాఫ్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మళయాళ భామ గోపికను తెలుగులో విజయాలు వరించలేదు. ఫ్యామిలీ టైపు హీరోయిన్ అన్న ముద్రను సొంతం చేసుకొంది. అయితే తమిళ, మళయాళ చిత్రాల్లో మంచి అవకాశాల్ని దక్కించుకోగలిగింది. ఆ పరిశ్రమలోనూ క్లీన్ ఇమేజ్ గోపిక స్వంతం. అందాల కుట్టి గోపిక సరైన వయసులోనే పెళ్లి చేసుకొని సినిమాలకు స్వస్తి చెప్పేయ బోతుంది. మే 22వ తేదీ ఆమె నిశ్చితార్థమైంది. లండన్‌లో స్థిరపడ్డ మళయాళీ యువకుడు డాక్టర్ అజిలేశ్‌ని గోపిక వివాహం చేసుకోబోతూంది. జూలై 17వ తేదీ ఈ వివాహానికి ముహూర్తం కుదిరినట్లు గోపిక కుటుంబ సభ్యులు తెలిపారు. కేరళలోని త్రిసూర్ సమీపంలో వున్న కొత్త మంగళంలో వివాహం జరగబోతూంది. పెళ్లయ్యాక గోపిక లండన్ వెళ్లిపోతుంది. తమిళ, మళయాళ భాషల్లో ఆమె ఒప్పుకున్న చిత్రాలన్నీ పూర్తి చేసింది.

ఆమె నటిస్తున్న ఆందమైన అబద్ధం చిత్రంపై ఆశలు పెట్టుకొంది. ముచ్చటగా మూడు సినిమాలు చేసినా సక్సెస్ లేని కామ్నా జెఠ్మలానీకి రవిరాజా పినిశెట్టి 'అందమైన అబద్ధం'తోనైనా సక్సెస్ వస్తుందో లేదో చూడాలి.



శింబుతో శ్రియ!

అందాల తార శ్రియకు కాస్త ధైర్యం ఎక్కువనే చెప్పాలి. ఆ మధ్య తిరుమలలో తనపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఒకరి చెంప చెళ్లుమనిపించి 'బాప్‌రే' అనిపించుకొంది. దీనికన్నా ముఖ్యమైన విషయమేమిటంటే తమిళ హీరో శింబు ప్రక్కన నటిస్తానని ప్రకటించడం. నయనతార – శింబుల ప్రేమ పెటాకులై ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తిన దగ్గర్నుంచీ శింబు ప్రవర్తన విచిత్రంగా వుంటోంది. సెట్లో దర్శకులతోనూ... హీరోయిన్లతోనూ శింబు ప్రవర్తన సరిగ్గా వుండడం లేదు. శింబు ప్రక్కన నటించడానికి హీరోయిన్లు జంకుతున్నారు. ఇది దర్శకులకు భారంగా మారింది. ఈ దశలో శింబు ప్రక్కన శ్రియ నటిస్తాననడం సంచలనం సృష్టించింది. ఈ సినిమా విషయాన్ని ప్రస్తావిస్తే కథ బాగుండాలి. అందులో పాత్ర నచ్చాలి. మిగతా విషయాలతో తనకు సంబంధం లేదంది.



ఒంటరితనం ఇష్టం!

దక్షిణాది చిత్రాల్లో హీరోయిన్‌గా ఒక దశలో దూసుకుపోయిన సగ్మా చేతిలో ప్రస్తుతం చిత్రాలు లేవు. భోజ్‌పురి చిత్రాల్లో మాత్రం అడపాదడపా నటిస్తుంది. నిరంతరం వార్తల్లో వుండే సగ్మా ఇటీవల చెన్నైలో కనపడి పలు విషయాలు చెప్పింది. నేను చుతం మార్చుకొన్నానని, ఆత్మహత్యకు పాల్పడ్డానని, క్రైస్తవ ప్రచారంలో పాల్గొంటున్నానని చెప్పుకొంటున్నారు. ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం నాకు లేదు. అన్ని కష్టాల్ని భగవంతుడు నాకెప్పుడూ ఇవ్వలేదు. మా అమ్మ ముస్లిం; నాన్న హిందూ. నేనూ హిందూ మహిళనేగా? నాకంటూ వ్యక్తిగత జీవితం లేకుండా పోయింది. హీరో శరత్ కుమార్, క్రికెటర్ గంగూలీ, ఈ మధ్యే ఓ భోజ్‌పురి నటుడు... వీళ్లందరిలోనూ నా పేరును ఆతకేశారు. కానీ ఏ బంధమూ లేదు. వీళ్లందరూ నా జీవితంలో నేను కలుసుకున్న పురుషులు. అంతే అంతకు మించి ఏమీ లేదు. చెల్లెలికి పెళ్లి పోయింది. నువ్వేంటి ఒంటరిగా అంటూ వుంటారు. అలా వుండటమే తన కిష్టముంది.

నెల్లూరు అబ్బాయికి

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు

ఏదైనా సాధించాలన్న తపన, దేశానికి సేవ చేయాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలన్న ఆలోచన వుండాలే గాని చిన్న వయస్సులోనే ప్రతిభ కనపరచవచ్చని నిరూపిస్తున్నాడు నెల్లూరు గోమతి స్కూలు విద్యార్థి ఎస్.హేమంత్. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బాల శాస్త్రవేత్తలకు అందజేసే బాలశ్రీ అవార్డుకు ఎంపికై న్యూఢిల్లీలో రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతుల మీదుగా అవార్డును అందుకొని జిల్లా పేరు ప్రఖ్యాతులను ఇనుమడింపజేశాడు హేమంత్. గోమతి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఈ చిన్నోడు చిన్నప్పటి నుంచి సైన్సు సబ్జెక్టు పట్ల ఎంతో మక్కువ చూపేవాడు. ఎప్పుడు సైన్సులో కొత్త ప్రయోగాలు చేయాలన్నా ఉత్సాహం, తెలియని విషయాలు తెలుసుకోవాలన్నా కాంక్ష, ఎవరికీ తెలియని విషయాన్ని కనుక్కొని తోటి విద్యార్థుల వద్ద ప్రత్యేక గుర్తింపు పొందాలన్న పట్టుదలతో హేమంత్ అనుక్షణం పరితపించేవాడు. సైన్సు పట్ల వున్న ఆసక్తి, అనురక్తే ప్రతిష్టాత్మకమైన బాల శాస్త్రవేత్తగా ఎంపికై దర్బార్‌హాలులో రాష్ట్రపతి చేతుల మీదుగా బాలశ్రీ అవార్డు పొందేందుకు దోహదం చేసింది. ఏరో సైన్సు, రోబొటిక్స్ విభాగాలలో పరిశోధనలు చేసినందుకు తనకు ఈ అవార్డు లభించిందని చెప్పిన హేమంత్ ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్, దేశం గర్వించతగ్గ శాస్త్రవేత్త, అణు పితామహుడు, మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలామ్‌ల స్ఫూర్తితోనే సైన్సు పట్ల మక్కువ పెంచుకొన్నానని చెప్పాడు. కలాం చెప్పిన మాటలు కలలు కనండి ఆ కలలను సాకారం చేసుకోండి అన్న




కొరవ 14వ పేజీలో

నిలువెత్తు మట్టి పరిమళం

నాగభైరవ కోటేశ్వరరావు!

"మట్టి కులంలో పుట్టినవాణ్ణి
నది నా చిరునామా
చుట్ట నాకు నేస్తం...
పద్యం, గేయం, వచనం
నా ఆయుధాలు....
వెన్నెల్లో వెలుతురు స్నానం చేస్తాను
అక్షరాన్ని ధరించిన యువకవి చేయి
పట్టి నడిపిస్తాను... నడుస్తాను...



అద్దం ప్రతిబింబంలో నిలువెత్తు
అక్షరాన్ని,
పంచెకట్టు ఆహార్యంలో తెలుగు
గ్రామీణ సంస్కృతి ప్రతినిధిని...
కవిత్వాన్ని శ్వాసలోంచి
మానవత్వాన్ని హృదయంలోంచి
పదుగురికీ పంచడమే తెల్సిన వాణ్ణి...
బెత్తం పట్టని మాష్టార్ని...
వాత్సల్యపు గొడుగు పట్టుకుని
అనురాగంతో హత్తుకోవడమే ఎరిగిన
వాణ్ణి
కవన విజయకేతనమై

కొరవ 14వ పేజీలో

తెలుగు సాహితీ గడ్డపై
అస్తమయం అన్నది లేక
రెపరెపలాడుతుంటాను
తెల్లని వత్తి రైతు సాక్షిగా...!

ఈ 70 యేళ్ల ప్రాయంలో 300 మంది యువ కవుల వెన్నుతట్టి ఆత్మీయంగా ప్రోత్సహించి అన్ని ప్రాంతాల్ని వాత్సల్యంతో కవిత్వ కరచాలనం చేసిన మట్టి పరిమళపు మా మంచి మాస్టారు, నాగభైరవ కోటేశ్వరరావు గారి గురించి ఎలిజీ వ్రాయాలంటే యిలాగే వస్తుంది. ఆయన నాకు విద్యాబుద్ధులు చెప్పిన

పెరుగు రామకృష్ణ


గురువు కాదు కానీ కవిత్వపు మెళకువలు చెప్పి కవిగా నువ్వో ప్రముఖుడవుతావనే భరోసా యిచ్చిన ఉన్నత శ్రేణి సంస్కారం గల సాహితీ మూర్తి. నాలాంటి ఎందరికో పూజనీయమైన పితృ వాత్సల్యాన్ని, స్వచ్ఛమైన, సహేతమయిన ఆత్మీయతను పంచిన ఆదర్శ మూర్తి. నిలువెత్తు తెలుగుతనంకు ప్రతీక. యువకవి కవిత్వంలో మెరుపు కన్పిస్తే చాలు, ఆయన ఎవరెస్ట్ ఎక్కిన ఆనందంతో హృదయ వైశాల్యం పెంచుకునే వారు. మళ్లీ మళ్లీ ఆ వాక్యాలు వల్లెవేసి వేదికలపై వాళ్లకో గట్టి పునాదులు వేసి కవిగా నిలబెట్టేవారు. యివాళ తెలుగు నేలపై ఆయన తోటమాలిలా అక్షరపు విత్తులు చల్లి పెంచిన కవులే ప్రముఖంగా కవిత్వం వెలువరిస్తున్నారు అంటే ఎంత మాత్రం అతిశయోక్తి కాదు.

పుట్టుకతో ప్రకాశం జిల్లా గుళ్లకమ్మ తీరంలో పేగు బంధం వుండా

> బ్రతుకంతా పి యణుల తోలికి, భేషజాల తోలికి పోకుండా గొప్ప మానవతావాదిగా మానవీయ స్పర్శతో సామాజిక అభ్యుదయ భావాలు పలికించిన చైతన్యశీలి నాగభైరవ. కవిగా, గేయకర్తగా, పద్యాన్ని హృద్యంగా నడిపే సారథిగా, సినీ గీత రచయితగా, పౌరాణిక స్క్రీన్‌ప్లే సృష్టికర్తగా లబ్ధ ప్రతిష్టుడాయన.

చ్చేమోకానీ, దశాబ్దం పాటు నెల్లూరు పెన్నాతీరంలో ఉన్న కాలమే ఆయన జీవితంలో అద్భుతమయిన కాలంగా చెప్పొచ్చు. కవిగా, కవన విజయం రూపకర్తగా అన్ని ప్రక్రియల్లో విజయ సాఫల్యం పొందిన బంధం నెల్లూరుతోనే వుంది. అందుకే ఈ ఆకుని, ఈ గాలిని, యిక్కడి మిత్రుల్ని జీవితాంతం

కొరవ 14వ పేజీలో



నమ్మిన సిద్ధాంతాన్ని కడవరకు
ఆచరించిన ధన్యజీవి మీరు...

వైద్యవృత్తిలో మీరో ఝంఝామారుతం
పీడిత తాడిత ప్రజలకు ఓ ఆశాదీపం
నమ్మిన సిద్ధాంత శిఖరాలు నిశ్శబ్దంగా ఎక్కి
చరిత్ర సృష్టించిన ధీరులు మీరు
అమృత వీరుల సాంగత్యం కోసం
సుదూర తీరాలకు వెళ్లినా...
మరపురాని మీతో గడిపిన క్షణాలు...

డాక్టర్ జి.కొండారెడ్డి
కొండారెడ్డి సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల - నెల్లూరు

డాక్టర్ ఐ. అనిల్‌కుమార్‌రెడ్డి
సభ్యులు, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ.
అనిల్ డయాబెటిస్ సెంటర్ - నెల్లూరు.

డాక్టర్ జెట్టి శేషారెడ్డి
డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల
నెల్లూరు.

జనంపై ధన వర్షం

మొదటి పేజీ తొరవ

స్థానంలో గెలుపు తన వ్యక్తిగత ప్రతిష్ఠగా తీసుకోవడం వల్ల వనరులకు వెనుకాడకుండా వెదజల్లారు. రెండు వేల ఓట్ల కనీస స్థాయి తేడాతో మళ్లి రవి బయట పడడానికి ఆ దన్నే ప్రధాన కారణం.

మూడవది - రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మంది సాధారణ ప్రజలకు తలా ఐదు వేల రూపాయలకు తగ్గకుండా ప్రభుత్వపరమైన పథకాలలో ప్రయోజనం కల్గించడం. ఇందుకోసం 10వేల కోట్లు ఖర్చు పెట్టాలని ఆర్థిక మంత్రి రోశయ్యను ఆదేశించారట. ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు ఏదో ఒక నెపంతో నేరుగా డబ్బు అందించే పథకాలను రూపొందించమని అధికారులను ఒత్తిడి చేస్తున్నారు. ఏడాది పొడుగునా జనం మీద ధన వర్షం కురిపించాలని ప్రణాళిక రచిస్తున్నారు. ఆగస్టు నెల ప్రారంభం నుంచి ఈ డబ్బు వానచినుకులు జనాన్ని వుక్కిరి బిక్కిరి చేయబోతున్నాయి. అంత సొమ్ము చేతికి తీసుకున్న ఓటర్లకు పోలింగ్ బూతులో వేరే పార్టీకి ఓటు వేయడానికి చేతులాడవన్నది ముఖ్యమంత్రి నిశ్చితాభిప్రాయం. ఈ అంశాలు మూడింటిలో ముఖ్యమంత్రి ఆలోచనలు ఆచరణ రూపం దాల్తే, రేపటి ఎన్నికలలో కాంగ్రెస్‌ను ఢీ కొనడం తతిమా పార్టీలకు అసాధ్యంగా మారుతుందన్నది వాస్తవం. జనంలో కాంగ్రెస్ గాలి వుందన్న అభిప్రాయం కల్గిస్తే, తెలుగు దేశం, చిరంజీవి పార్టీలు నైతికంగా దెబ్బతిని పోతాయని భావిస్తున్నాడు ముఖ్యమంత్రి. ఈ విషయాలన్నీ పక్కనపెడితే రానున్నవి ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు పండుగ దినాలే.

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ తొరవ

చదివే గిరిజనుల పిల్లలకు జనహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు అవసరమైన డిక్షనరీ, ఇంగ్లీషు గ్రామర్ పుస్తకాలు, జామెట్రీ బాక్సులను ట్రస్ట్ నిర్వాహకుడు ఎ.వి. రావు పంపిణీ చేశారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో చేరేందుకు అవసరమైన కోచింగ్ కూడా ఇప్పిస్తామన్నారు.

నాగభైరవ కోటేశ్వరరావు

13వ పేజీ తొరవ

స్మరిస్తూనే వుండేవారు. మట్టిని, మనుషుల్ని గాఢంగా ప్రేమించే గుణం వుండే, ఒక గొప్పతరంకు బహుశా ఆఖరి ప్రతినిధి కాబోలు. అందువల్లే 'నన్నయ్య నుండి నాగభైరవ దాకా...' అనే వాక్యానికి నానుడి కాగలిగారు. 75వ యేట ఆయన ముచ్చటపడి ప్రాసిన ముత్యాలసరాలులో నెల్లూరుతో అనుబంధం వున్న అందర్నీ ఎంతో అభిమానంగా అక్షరీకరిస్తే, వెంటనే నెల్లూరు జిల్లా రచయితల సంఘం ప్రచురణగా 'శతమానం' ప్రచురించి ఆయనకు గురు దక్షిణగా సమర్పించారు నెల్లూరు శిష్యులు. యిది మరపురాని అనుభూతి... మరచిపోలేని ఆ మహాకవికి చందనపుష్పాంజలి... నెల్లూరులో ప్రాచీన సాహిత్యానికి మాత్రమే పట్టంకట్టే సాహితీ సమావేశాల దారిని మళ్లిస్తూ ఆధునిక భావాలతో 'చేతన' సంస్థనేర్పాటు చేసి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్, నెల్లూరు దోలేంద్ర ప్రసాద్ లాంటి వాళ్ని అందులో భాగం చేసి ఎందరో కవులను వెలికితీసిన వారు నాగభైరవ.

ప్రతుకంతా ఏ యిజాల జోలికి, భేషజాల జోలికి పోకుండా గొప్ప మానవతా వాదిగా, మానవీయ స్పృహతో సామాజిక అభ్యుదయ భావాలు పలికించే చైతన్య శీలి అయిన కవిగా, గేయకర్తగా, పద్యాన్ని హృద్యంగా నడిపే సారథిగా, సినీ గీత రచయితగా, పౌరాణిక స్క్రీన్‌ప్లే సృష్టికర్తగా, చివరి వరకు భాగవతం మాటల సహకారం అందించి అవిశ్రాంత కలం యోధుడిగానే శ్రమించారాయన. వల్లెటూరు ఎడ్లబండిలాగే జీవితం ముళ్లబాటలోనే ఎక్కువగా పయనించినా కవిగా, సాహితీ కర్తగా, కేంద్ర సాహిత్య అకాడమీ, అధికార భాషా సంఘం, కేంద్ర సెన్సార్ బోర్డ్, తెలుగు విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా ఎంతో గౌరవాన్ని పొందారు. ఆయా పదవులకు తెలుగు దనాన్ని, మట్టి పరిమళాన్ని హుందాగానే అద్ది అలంకరించారు. కావ్యం నుండి కవిత దాకా ఏదీ కొసకి 'నా ఉదయానికి అస్తమయం లేదు...' అని ధీమాగా ప్రకటించిన ధీశాలి అయిన మహాకవి అస్తమించాడంటే ఎవరు నమ్మరు...? కవికి మరణం లేదు... కవితాత్మగా మంచి కవితతో, అక్షరాన్ని వీడిపోని ఆత్మగా మనతోనే ప్రవహిస్తుంటారు 'నది నా చిరునామా'... అన్నట్లుగా... "నెల్లూరు సాహితీ పుటల్లో ఓ మరపురాని సంతకం నాగభైరవ మాష్టారు...!!"

దిక్కులేని దేశం

6వ పేజీ తొరవ

చెప్పి వెళ్తుంటాడు. ఇక దేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సైతం బియ్యం వ్యాపారంలో తలమునకలై వుంటాడు. నాయకులు లేకపోవడం, వున్న నాయకులు పట్టించుకోక పోవడంతో పోలీస్‌స్టేషన్లు, మండల కార్యాలయాల్లో పనులు చేయించే దిక్కు లేదని, కాంగ్రెస్ పార్టీని ఢీ కొనలేక వారితో కలిసి కొంతమంది నాయకులు తిరుగుతూ దేశం పార్టీ బాధ్యతల నుండి అన్న సన్యాసం చేస్తున్నారని మండలంలోని పార్టీ కార్యకర్తలు వాపోతున్నారు. చివరకు పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి వేడుకలను నిర్వహించలేదంటే కలువాయి మండలంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతుంది.

ఎమ్మీడిఓ

6వ పేజీ తొరవ

ఇప్పుడు వారి అవినీతిని వెలికితీసే సాహసం చేయలేక, పక్కదారి పట్టించేందుకు కొమ్మి తనను దూషించారంటూ పెడబొబ్బలు పెట్టి ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చేజర్లతోపాటు, కలువాయి మండలంలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నెల్లూరు ఎసిబి అధికారులు ఈ పనులకు సంబంధించిన రికార్డులను గత నెల 27వ స్వాధీనం చేసుకొని వెళ్లారు. ఈ విషయాన్ని పసిగట్టిన సిబ్బంది చాలా మటుకు రికార్డుల్లో మార్పులు, చేర్పులు జరిపినట్లు సమాచారం. చనిపోయిన వారిని, గ్రామాల్లో లేని వారిని, కాలేజీల్లో చదివే పిల్లల పేర్లను కూలీలుగా నమోదుచేసి భారీస్థాయిలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

పింఛన్ల స్వాహా

6వ పేజీ తొరవ

జయమ్మ పింఛను దారుల సొమ్మును లబ్ధిదారులకు ఇవ్వకుండా కాజేసింది. ఆలస్యంగా విషయం తెలుసుకొన్న గ్రామస్తులు సమాచార హక్కు చట్టం క్రింద సమాచారం తెప్పించుకోవడంతో జయమ్మ చేసిన మోసం బట్టబయలైంది.

స్పెషల్ ఆఫర్

6వ పేజీ తొరవ

దుగానే ఇస్తామని, పరీక్షల ఫీజులు తామే భరిస్తామని రకరకాల వ్యాపార ట్రిక్కులన్నింటినీ విద్యార్థులు, తల్లితండ్రులపై ప్రయోగిస్తుండడంతో పిల్లల్లో దిక్కుతోచని స్థితి నెలకొనింది.

కామెర్లు

9వ పేజీ తొరవ

నగర్‌లోనూ అధికంగా ఈ వ్యాధికి గురైనవారు వున్నారు. బుజ్జమ్మరేవు ప్రాంతంలో పైపు లీకేజీల వల్లే కలుషిత నీరు ప్రవహించి దీన్ని త్రాగడం మూలంగా జబ్బున పడుతున్నారు. నీరసం, ఆకలి లేకపోవడం, వాంతులు, ఒళ్లు నొప్పులు, కళ్లు పచ్చగా, మూత్రం పచ్చగా రావడం ఈ వ్యాధి లక్షణాలని, వీటిని గమనించిన వెంటనే వైద్యుని వద్ద చికిత్స పొందాలని డాక్టర్లు చెబుతున్నారు.

ఎరువుల కొరత

7వ పేజీ తొరవ

చేయాల్సి వస్తోంది. యూరియా, డిఏపి, పొటాషియం, సల్ఫర్ ఫాస్ఫేట్, పురుగుల మందుల కొరత రైతాంగాన్ని చికాకు పెడుతున్నది. ఎరువుల కొరతను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా వ్యయసాయశాఖ స్పందించి అవసరానికి సరిపడే ఎరువులను అందించడంతోపాటు, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపైనా చర్యలు చేపట్టాల్సి వుంది.

అవినీతి జమానా

6వ పేజీ తొరవ

ఓటర్ల జాబితా నమోదు కార్యక్రమం నత్తనడకన సాగుతుంది. ఈ నమోదు కార్యక్రమానికి ఒక టీచర్, రెవిన్యూ సిబ్బంది, కెమెరామెన్ ముగ్గురూ ఇల్లిల్లు తిరుగుతూ నమోదు చేయాల్సి వుంది. మండలంలో ఎక్కడా రెవిన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్న దాఖలాలు లేవు. ఉపాధ్యాయుడు, ఫోటోగ్రాఫర్ మాత్రమే రోజులో కొన్ని ఇళ్లకు మాత్రమే వెళ్లి పని పూర్తయిందని పిస్తున్నారు. గతంలో కేవలం ఓటరు జాబితా మాత్రమే వుండేది. ఈ దఫా ఫోటో కూడా వుండాల్సిరావడంతో ఎన్నికల సమయంలో కార్డులు ముఖ్యపాత్ర పోషించనున్నాయి. ప్రజల నుంచి పెద్దగా స్పందన వుండటంలేదని సిబ్బంది తప్పించుకోజూస్తూ సాదివేత ధోరణిని అవలంభిస్తున్నారు. ఉన్నతాధికారులు అత్మకూరు మండలంలో ఫోటో ఓటర్ల జాబితా కార్యక్రమాన్ని పర్యవేక్షించక పోవడంతో ఈ నమోదు ప్రక్రియ చాలా ఆలస్యంగా జరుగుతున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు శ్రద్ధ చేసుకొని కార్యక్రమం తుదితగతిన పూర్తయ్యేలా రెవిన్యూ సిబ్బంది పాల్గొనేలా చూడాల్సి వుంది.

అరెస్ట్

9వ పేజీ తొరవ

తం మన సరిహద్దుల్లో నిఘా లోపాన్ని ఎత్తి చూపుతుంది. రబ్బీవుల్ ఇస్లాంతో నెల్లూరులో స్థిరపడిపోయిన మిగిలిన ఇద్దరు బంగ్లాదేశీయులను పోలీసులు వెతికి పట్టుకోవాలి.

మద్యం షాపులు

9వ పేజీ తొరవ

అర్థం చేసుకోవచ్చు.

16వ తేదీ మద్యం షాపుల టెండర్లు ఖరారును పురస్కరించుకొని పొదలకూరురోడ్డు, పోలీసాఫీసు ప్రక్కన, కెవిఆర్ పెట్రోల్ బంకు, కుమార్ అపార్ట్‌మెంట్ ప్రక్క సందులను పెద్ద పెద్ద బ్యారికేడ్లు కట్టి ఒక్క మనిషి కూడా నడవకుండా చేశారు. లోక్‌సత్తా కార్యకర్తలను నిలువరించను 350 మంది పోలీసులతో సిఎం రాకను మించిన బందోబస్తు ఏర్పాటుచేసి జనాన్ని ఇబ్బంది పెట్టడం విమర్శలకు తావిచ్చింది. అయినా జనాన్ని తాగించి ఆ డబ్బుతోనే కదా ప్రభుత్వం నడుస్తుందేది. ఆదాయం పట్ల ఆ మాత్రం శ్రద్ధ తీసుకోకుంటే ఎట్లా?

ఉపాధి హామి

11వ పేజీ తొరవ

సైతం ఈ పథకం అమలు బాధ్యతలు తీసుకున్న డ్వామా పిడి సుబ్బరాజుకు నోటీసులు జారీ చేసింది.

అవార్డు

13వ పేజీ తొరవ

వాక్యాలు తనను పదేపదే లక్ష్యం వైపు మళ్లేందుకు మార్గదర్శనం చేస్తున్నాయని వినమ్రంగా చెబుతున్న హేమంత్ స్కూలులో తనను సైన్సుసబ్జెక్టులో ప్రోత్సహించిన ఉపాధ్యాయులు వి.విజయకుమారి, ఆర్.మల్లిఖార్జునరావు, కరస్పాండెంట్ అరుణలకు కృతజ్ఞతలు తెలిపాడు. భవిష్యత్తులోనూ ఏరో సైన్సు రోబొటిక్స్‌లో మరింత పరిశోధనలు జరిపి యువ శాస్త్రవేత్తగా ప్రపంచ గుర్తింపు పొందాలన్నదే ఆశయమంటున్న హేమంత్ తల్లిదండ్రులు ఇస్తున్న ప్రోత్సాహం మరువలేనిదంటున్నాడు.

సినిమా సమీక్ష

11వ పేజీ తొరవ


ఈ చిత్రంలో వెన్నెలకంటి, వేటూరి భువనచంద్ర కలసి ప్రాసిన పాటలు వాటికి హిమేష్ రేష్మియా కూర్చిన సంగీతం గందరగోళమే. దేవిశ్రీ ప్రసాద్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అంతే. అబ్బురపరిచే పర్యావేశాలకు అద్భుత సెట్టింగులు వేసిన కోట తరణీని అభినందించాల్సిందే. ఎక్కడా పసుగు పుట్టని విధరగా ఎడిటింగ్ చేసిన తనికెలంను ప్రత్యేకంగా ప్రస్తావించాలి.

దశావతారంలో ఏ పాత్రలోని కమల్ నటనను వేలెత్తి చూపలేం. హీరోయిన్ ఆసిన్ రెండు పాత్రల్లో జీవించింది. సిఐఏ ఏజెంట్‌గా మల్లికా షెరావత్, పంజాబీ గాయని భార్యగా జయప్రద నటన చెప్పుకోతగ్గ స్థాయిలో లేదు. ఈ మంది దిగంలో ఓ చోట కన్నించాలన్న తపనలో దర్శకుడు కెఎస్ రవికుమార్ దివరన ఓ డ్యాన్స్‌లో దుమ్ము దులుపుతాడు. కమల్ పోషించిన పది పాత్రలకు ఎన్నీ బాలసుబ్రహ్మణ్యం విలక్షణంగా డబ్బింగ్ చెప్పాడు.

ఇక చిత్ర కథలోనికి వెళ్తే 12వ శతాబ్దంలో దక్షిణ భారతంలో కుతుత్రోంగ చోళుడు(జెపోలియన్) పాలన సాగిస్తుంటాడు. అతను శైవుడు. వైష్ణవుడైన రంగరాజ నంబి (కమల్ హాసన్) తోపాటు శ్రీరంగనాథుడుని సముద్రంలో ముంచేస్తాడు. ఆ తర్వాత కథ 2004 సంవత్సరంలోకి ప్రవేశిస్తుంది. అమెరికా బయోటెక్నాలజీ విభాగంలో శాస్త్రవేత్తగా పనిచేసే గోవిందరాజులు(కమల్ హాసన్) ప్రపంచాన్ని సర్వ నాశనం చేసే బయో పదార్థం తయారీలో మునిగితేలుతుంటాడు. దీనికిగానూ అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ (కమల్ హాసన్) అరుబిలియన్ డాలర్లు కేటాయిస్తాడు. ఈ పరిశోధనా విభాగంలోని డాక్టర్ సేతు ఈ ఫార్ములాను ఇతరులకు అమ్మే ప్రయత్నాన్ని అడ్డుకోవడంలో ఈ చిప్ భద్రపరచిన ఇండియా వెళ్లే కంటైనర్‌తో పాటు విమానమెక్కుతాడు గోవింద రాజులు. అతన్ని వెంటాడే సిబిఏ మాజీ ఏజెంట్ ఫ్లెచర్ (కమల్ హాసన్) కూడా జపాన్ దుబాసీ (మల్లికా షెరావత్)తో కలసి బయలు దేరుతాడు. బయో చిప్ కొరియర్ చిదంబరంలోని బామ్మ కృష్ణవేణి (కమల్ హాసన్) వద్దకు చేరుతుంది. ఆమె మనుమరాలు లక్ష్మి (ఆసిన్)తో బయో శాస్త్రవేత్త గోవింద రాజులుకు పరిచయమవుతుంది. పిచ్చి బామ్మ బయో చిప్‌ను గ్రామోత్సవంలో వున్న పెరుమాళ్లు పొట్టలో వేస్తుంది. జార్జిబుష్ ఈ విషయమై భారత ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఫోన్ చేయడంతో ఎఫ్‌బిఐ, సిబిఐ రంగంలోకి దిగుతాయి. చెన్నై సిబిఐ అధికారి బలరాం నాడర్ (కమల్ హాసన్) చిప్ కోసం చిదంబరం వెళ్లి గందరగోళం చేస్తాడు. మధ్యలో పంజాబీ గాయకుడు అవతార్‌సింగ్ (కమల్‌హాసన్), జపాన్ కరాటే మాస్టర్ (కమల్ హాసన్), దళిత నాయకుడు పుణ్యకోటి (కమల్ హాసన్), పాడుగు ముస్లిం యువకుడు సమీవుల్లా (కమల్ హాసన్) కథలో చొరబడతారు. అంతిమంగా ఫ్లెచర్, బయో చిప్‌ను చేజిక్కించు కొంటాడు. అతడ్ని బలరాం నాడర్ అరెస్ట్ చేయబోయే సరికి దాన్ని తిన్న అతని కణాలు పేలిపోతాయి. చిప్‌లోని బయో క్రిముల వల్ల ప్రపంచానికి ఉత్పాతం తప్పదనుకొన్న క్షణంలో ప్రకృతి ఉత్పాతం 'సునామి' రావడం కథ సుఖాంతం కావడం జరుగుతుంది.

చరిత్ర, సైన్సుల మధ్య ఆధ్యాత్మికత పొరబడే చిత్ర సన్నివేశాల్లో చదువరులకు అక్కడక్కడ కొన్ని సందేహాలు కలిగినా 'దశావతారాన్ని' హాయిగా చూసేయవచ్చు.

ప్రాథమికోన్నత పాఠశాలలు మూసేస్తే ఎలా?



రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలన్నింటిలో ఇంగ్లీషు మీడియంను, సిబిఎస్ఇ సిలబస్‌ను ఆరవ తరగతి నుంచి ప్రవేశ పెట్టింది. దీనికోసం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ నిచ్చి సిద్ధం చేసింది. ఇంత వరకు బాగానే వున్నా రాష్ట్రంలోని పలు ప్రాథమికోన్నత పాఠశాలల విలీనమని పేరు పెట్టి అధిక సంఖ్యలో స్కూళ్లు మూసివేతకు రంగం సిద్ధం చేసింది ప్రభుత్వం. నెల్లూరు జిల్లాలోనూ 120 ప్రాథమికోన్నత పాఠశాలలు మూసివేయనున్నారు. రెండు కిలోమీటర్ల పరిధిలో వుండే ప్రాథమిక పాఠశాలలను మూసివేసి ఆ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రక్కనే వుండే ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయనున్నారు. సంస్కరణల పేరుతో, విద్యార్థులకు సిబిఎస్ఇ సిలబస్‌ను ఆంగ్ల మాధ్యమంలో బోధించి వారికి చక్కని విద్యను అందించాలన్నదే తమ ధ్యేయమని, అందులో భాగంగానే ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టామని ప్రభుత్వం, అధికారులు చెబుతున్నప్పటికీ నూతన విద్యావిధానం వల్ల పట్టణాలు, గ్రామాలలోని పలు ప్రాథమిక పాఠశాలలకు మంగళం పాడటం వల్ల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. అసలే సిబ్బంది కొరత, సౌకర్యాలేమి వదుమ విద్యను అభ్యసిస్తున్న చిన్నారులు పాఠశాలల విలీనం వల్ల మరింత అవస్థలు పడనున్నారనేది వాస్తవం. అల్లూరు మండలంలోని శంఖునిపాళెం పాఠశాలను ఎలాంటి ప్రయాణ సౌకర్యం లేని చెన్నారాయుని పాళెంకు, పెళ్లకూరు మండలం తాళ్ళాయిపాడు, తోటపల్లి గూడూరు మండలంలోని ఆర్‌వికండ్రిగ, కొత్తకోడూరు పాఠశాలలు అధికారుల అవగాహనా లోపం వల్ల మార్చిన నిర్ణయాలు విద్యార్థుల పాలిట శాపంగా మారనున్నాయి. పాఠశాలల విలీనంపై వివిధ వర్గాల ప్రతినిధుల అభిప్రాయాలు సేకరించి దిగువనిస్తున్నాం. చదవండి.


ప్రైవేట్ పరం చేయడానికే!

మాతృభాషలో విద్యాబోధన సెకండరీ స్థాయి వరకు జరిగితేనే విద్యార్థులు భవిష్యత్తులో ఏ భాషనైనా నేర్చుకొనేందుకు అవకాశం వుంటుంది. కొఠారి కమీషన్‌గానీ, శాస్త్రజ్ఞులు, అనుభవజ్ఞులు మాతృభాషలో కొంతవరకు విద్యా బోధన జరగాలనే చెప్పున్నారు. వున్నట్లుండి సిబిఎస్ఇ సిలబస్, ఇంగ్లీష్



మీడియం ప్రవేశపెట్టి, జిల్లాలో 120 ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేయడం వల్ల పేద విద్యార్థులు నష్టపోతారు. ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకాన్ని పోగొట్టి ప్రైవేట్ పరం చేయాలన్నది ప్రభుత్వ వుద్దేశ్యం.

కె.వెంకటేశ్వరరావు,
ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు.



డ్రాపవుట్స్ పెరుగుతారు!

ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయం వల్ల డ్రాపవుట్స్ పెరుగుతారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయకుండా ఇంగ్లీషు మీడియం పేరుతో సిబిఎస్ఇ సిలబస్ పెట్టి ప్రాథమికోన్నత పాఠశాలలను తొలగించడం అన్నది సబబు కాదు. పేద పిల్లలకు ప్రభుత్వ నిర్ణయం విద్యాభ్యాసానికి అడ్డంకిగా మారనుంది. పాఠశాలల విలీనం వల్ల అసలే అరకొర వసతులతో వున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతోపాటు టీచర్ల సంఖ్య పెరిగి కూర్చునేందుకు కూడా వసతిలేని పరిస్థితులు ఏర్పడుతాయి. బాలికల పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులను 50 సంవత్సరాలలోపు వున్నవారిని నియమించరు. కానీ ఈ నిర్ణయం వల్ల మగ టీచర్లందరూ బాలికల పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. వందల మంది పిల్లలు వుండే పాఠశాలలు మూత పడడం అనేది పిల్లలకు చాలా నష్టం. దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

వి.బాబురెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి.

సమాచారమే లేదు!

నెల్లూరు రూరల్ మండలంలోని పెద్ద చెరుకూరులో గల ప్రాథమికోన్నత పాఠశాలలోపి ఆరు, ఏడు తరగతులను తొలగించడం అన్యాయం. ఈ పాఠశాల పూర్వవిద్యార్థి, వర్మదూషణ్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి పాఠశాలకు రూ.7.60 లక్షలు విరాళంగా అందజేసి పాఠశాలను అభివృద్ధి చేశారు. ఎక్కువ మంది పిల్లలు చదువుకొంటున్న ఈ స్కూలులో



ప్రాథమికోన్నత పాఠశాలను రద్దు చేసి, ఉపాధ్యాయులను, పిల్లలను అల్లీపురంలోని ఉన్నత పాఠశాలకు తరలించడం అన్యాయం. దాతకుగానీ, పాఠశాలకు పేరు పెట్టిన నాడు గానీ, పంచాయితీ సర్పంచ్‌కు కూడా మాట మాత్రం చెప్పకుండా అధికారులు తీసుకొన్న నిర్ణయం సరైంది కాదు. తక్షణం ఈ ఉత్తర్వును ఉపసంహరించుకోవాలి.

గండవరపు సేతురామిరెడ్డి,
సంఘసేవకుడు.

ఫైనాన్సియర్

తిరుపాల్‌రెడ్డి ఔదార్యం!

దేశం కాని దేశం... చేతిలో చిల్లిగవ్వ లేదు... తినడానికి తిండి; వుండడానికి చోటు లేక ఆరు నెలలుగా నెల్లూరు యువకుడు మలేషియాలో పడిన నరకయాతన గూర్చి విని చలించి తన సొంత డబ్బు వెచ్చించి




తిరుపాల్‌రెడ్డిని అభినందిస్తున్న ఎస్వీ మల్లారెడ్డి.

నికి చేదోడు వాదోడుగా వుండాలని, బాగా డబ్బు సంపాదించి ఆర్థికంగా పురోగతి సాధించాలని ఆశపడ్డ యువకుడు. భాస్కర్‌రెడ్డి అనే ఏజెంటును కలసి అతనికి 3.70 లక్షల రూపాయలు అప్పోసొప్పో చేసి చెల్లించారు. వీసా వచ్చి మలేషియా వెళ్లిన సుధాకర్‌రెడ్డికి ఏజెంటు చెప్పిన ఉద్యోగం కాకుండా ఒక చోట స్వీపర్ ఉద్యోగం ఇచ్చారు. అక్కడ ఇచ్చే డబ్బులు చాలక, తిండిలేక, వుండటానికి చోటులేక నానా అగచాట్లు పడుతూ, ఎక్కడ పోలీసులు

తిరిగి ఆ యువకుడు సొంత వూరికి రప్పించేందుకు కృషిచేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు నెల్లూరులో ప్రముఖ ఫైనాన్సియర్ చెరుకుపల్లి తిరుపాల్‌రెడ్డి. కూరలే మండలంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాగరత్నమ్మ శ్రీనివాస్‌రెడ్డిల కుమారుడైన సుధాకర్‌రెడ్డి కుటుంబా

తరువ 14వ పేజీలో



బ్రహ్మోత్సవ ఆహ్వానం

శ్రీ వెంగమాంబ పేరంటాలు దేవస్థానము

నత్తవాడ, దుత్తలూరు మండలం, నెల్లూరు జిల్లా.
ఫోన్: 08629 - 240636

శ్రీ వెంగమాంబ పేరంటాలు, నత్తవాడ, దుత్తలూరు మండలం, నెల్లూరు జిల్లా సన్నిధి నందు వార్షిక బ్రహ్మోత్సవములు 22-6-2008 నుండి 26-6-2008తేది వరకు నిర్వహించబడును. కావున వెంగమాంబ పేరంటాలు తల్లిని భక్తులు దర్శించి, ఆశీస్సులు పొందగోరుచున్నాము.

కార్యక్రమములు

22-6-2008	ఆదివారం	నిలుపు, సంతానం లేనివారు వరపడుట.
23-6-2008	సోమవారం	గ్రామ ఉత్సవం, సంతానము లేనివారు వరపడుట
24-6-2008	మంగళవారం	గ్రామ ఉత్సవం
25-6-2008	బుధవారం	పసుపు, కుంకుమ ఉత్సవం (పగలు) ప్రధానోత్సవం మరియు సాంస్కృతిక కార్యక్రమములు (రాత్రి)
26-6-2008	గురువారం	బండ్లు, పొంగళ్ళు, బండలాగు పండెము

ఇట్లు
వ్యవస్థాపక ధర్మకర్తలు
సర్వ జీవ శుభాభిలాషులు
కార్యనిర్వహణాధికారి

ప్రారంభోత్సవ ఆహ్వానం

మాదాల రాములమ్మ మెమోరియల్‌ట్రస్ట్ వారిచే నిర్మింపబడిన


జగన్మాత శ్రీ వెంగమాంబ కళ్యాణ వేదిక



శ్రీశ్రీశ్రీ వెంగమాంబ నగర్వాడ నెల్లూరు జిల్లా

తేది : 26-06-2008 సమయం : మ॥ 12-00 గంటలకు

ప్రారంభకులు



శ్రీ నేదురుమల్లి జనార్దనరెడ్డి
మాజీ ముఖ్యమంత్రి వర్యులు



శ్రీమతి రాజ్యలక్ష్మి
స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి వర్యులు




శ్రీ ఆనం రామనారాయణరెడ్డి
సమాచారశాఖామాత్యులు



శ్రీ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి
ఎమ్మెల్యే, ఉదయగిరి


గార్లచే నూతన కళ్యాణ మండపం ప్రారంభోత్సవం మరియు శ్రీ వెంగమాంబ కళ్యాణోత్సవం అత్యంత వైభవముగా, కన్నుల పండుగగా జరుగును.ప్రారంభోత్సవ వేడుకల్లో భారీగా భక్తులు తరలివచ్చి జగన్మాతను దర్శించి ఆ తల్లి కృపకు పాత్రులు కాగలరని మనస్ఫూర్తిగా కోరుకొంటూ

ఎల్లప్పుడు తల్లి సేవలో



మాదాల తిమ్మయ్య

జగన్మాత
వెంగమాంబ ట్రస్ట్
మాదాల రాములమ్మ
మెమోరియల్ ట్రస్ట్



మాదాల జానకిరాం

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

22-06-2008	ఆదివారం	- నిలుపు, సంతానం లేనివారు వరపడుట
23-06-2008	సోమవారం	- గ్రామఉత్సవం, సంతానం లేనివారు వరపడుట
24-06-2008	మంగళవారం	- గ్రామ ఉత్సవం
25-06-2008	బుధవారం	- పసుపు, కుంకుమ ఉత్సవం (పగలు) ప్రధాన ఉత్సవం మరియు సాంస్కృతిక కార్యక్రమాలు (రాత్రి)
26-06-2008	గురువారం	- బండ్లు, పొంగళ్ళు, బండలాగు పందెము.

Edited, Printed and Published by N. Dolendra Prasad, Ph: 091-861-2327354, Offset Printing at Zamindyot Press, Nellore.